www.visalaandhra.com

శనివారం
14-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 114
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఆక్రమణ ముగిస్తేనే శాంతి

ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరులో అంతర్జాతీయ చట్టం తీవ్రస్థాయిలో అతిక్రమణకు గురవుతోందని ఆక్రమిత పలస్తీనా భూభాగాల దర్యాప్తు కమిషన్ వెల్లడించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. హింసను ఆపేందుకు, సుస్థిర శాంతి నెలకొల్పేందుకు ఏకైక మార్గం పలస్తీనా భూభాగంపై కొనసాగుతున్న అక్రమ ఆక్యుపేషన్‌ను నిలిపివేయడమే అని కమిషన్ నొక్కిచెప్పింది.

2లో

చంద్రబాబు ఆరోగ్యంపై
అలజడి

- స్టెరాయిడ్ల ప్రయోగ యత్నం చేస్తున్నారన్న లోకేశ్
- ఐదు కిలోలు తగ్గారని బ్రాహ్మణి, భువనేశ్వరి ఆందోళన
- సీఎం జగన్ ఇంటికెళ్లేందుకు టీడీపీ నేతల యత్నం
- తాడేపల్లిలో అడ్డుకున్న పోలీసులు. ఉద్రిక్తం
- రాజమండ్రిలో తెలుగు తమ్ముళ్లు జైల్‌భరో
- జైలేమైనా అత్తగారిల్లా అంటూ సజ్జల వ్యంగ్యాస్త్రాలు
- ఆరోగ్యం, భద్రతపై జైళ్లశాఖాధికారుల వివరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజమహేంద్రవరం జైలులో 35 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై రాష్ట్రంలో అలజడి చెలరేగింది. ఆయన ఆరోగ్యంపై చంద్రబాబు కుటుంబసభ్యులు వరుస ట్వీట్‌లు చేస్తూ ఆందోళన వ్యక్తం చేయడం, టీడీపీ ముఖ్యనేతలు ఏకంగా సీఎం జగన్ ఇంటికి వెళ్లడానికి ప్రయత్నించడం, రాజమండ్రి జైలు వద్ద తెలుగు తమ్ముళ్లు జైలుభరోకి దిగడం వంటి పరిణామాలతో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆఘమేఘాలపై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి...టీడీపీ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నదని, ఆయన జైలులో మరో కేజీ అదనంగా పెరిగారని, అయినా జైలు ఏమైనా ఆయన అత్తగారి ఇల్లా...అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మరోపక్క జైళ్లశాఖ ఉన్నతాధికారులు అత్యవసరంగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి చంద్రబాబు ఆరోగ్యం, భద్రతపై వివరణ ఇచ్చారు. తొలుత నారా లోకేశ్ జైలులో చంద్రబాబు ప్రాణాలకు ముప్పు ఉందంటూ ట్వీట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబుపై స్టెరాయిడ్లు ప్రయోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వ వైద్యులు, జైలు యంత్రాంగం వాస్తవాలు దాస్తున్నారని మండిపడ్డారు. 'చంద్రబాబుకు ఏదైనా హాని జరిగితే జగన్‌దే బాధ్యత. చంద్రబాబు ప్రాణాల

- మిగతా 2 లో

సుప్రీంలో చంద్రబాబు క్వాష్ పిటిషన్
విచారణ 17కి వాయిదా

- 17ఏ వర్తింపుపై వాడీవేడిగా వాదనలు
- ఫైబర్‌నెట్ కేసు విచారణ కూడా ఆరోజే
- అంగళ్లు కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు



2లో

విద్వేషం రగల్చటంలో
సహకరించొద్దు

- ఎన్నికల దృష్ట్యా ప్రజాస్వామ్య భావాల వక్రీకరణ వద్దు
- కార్యకలాపాల్లో తటస్థతకు హామీ ఇవ్వాలి
- మెటా, గూగుల్ సీఈవోలకు ఇండియా కూటమి లేఖలు

న్యూదిల్లీ: దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు సామాజిక మాధ్యమాలు సాధన కాకుండా చర్యలు తీసుకోవాలని మెటా, గుగుల్ సంస్థల సీఈవోలు మార్క్ జకర్‌బర్గ్, సుందర్ పిచాయ్‌కు 28 ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి సూచించింది. ఒక రాజకీయ పార్టీ (బీజేపీని ఉద్దేశించి)పై ప్రైవేటు విదేశీ సంస్థ ఇంతగా పక్షపాతం చూపుతుండటం అంటే అర్థం భారత ప్రజాస్వామ్యంలో జోక్యం చేసుకోవడమే అవుతుందని వెల్లడించింది. భారత ప్రజాస్వామ్యంలో జోక్యంచేసుకుంటే ఇండియా కూటమి ఉపేక్షించబోదని హెచ్చరించింది. ఎన్నికలకు ముందు ప్రజాస్వామ్య భావాలను వక్రీకరించకుండా ఉండటం అత్యవసరమని తేల్చిచెప్పింది. పాలక పక్షానికి అనుకూలంగా ఫేస్‌బుక్ ఇండియా ఎగ్జిక్యూటివ్‌లు పని చేస్తున్నారని ఇండియా కూటమి ఆరోపించింది. అధికార పార్టీకి సంబంధించిన ప్రచారంలో మెటా మాధ్యమంగా ప్రతిపక్ష నేతల కంటెంట్ తొక్కిపెట్టడం, అల్గోరిథమ్ మాడరేషన్ జరిగినట్లు తమ వద్ద డేటా ఉన్నట్లు పేర్కొంది. 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈ అంశాలను తీవ్రంగా పరిగణించాలని హితవు పలికింది. భారత్‌లో మెటా కార్యకలాపాలు తటస్థంగా సాగేందుకు తక్షణమే హామీనివ్వాలని జకర్‌బర్గ్‌ను లేఖ ద్వారా ప్రతిపక్ష పార్టీలు కోరాయి.

ఇవే అంశాల గురించి తగు చర్యలను డిమాండ్ చేస్తూ మార్క్ జకర్‌బర్గ్, సుందర్ పిచాయ్‌కు వేర్వేరుగా లేఖలను ఇండియా కూటమి పంపింది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్‌లో బీజేపీకి మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం జరుగుతున్నట్లు వాషింగ్టన్ పోస్ట్ చేసిన ఆరోపణలను ప్రధానంగా లేఖల్లో ప్రస్తావించింది. జకర్‌బర్గ్‌కు రాసిన లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఎక్స్ మాధ్యమంగా పంచుకున్నారు. వాషింగ్టన్ పోస్టు దర్యాప్తు అంశాలను లేఖల్లో పొందుపర్చారు. 'అధికార బీజేపీ మత విద్వేష ప్రచారంలో వాట్సాప్, ఫేస్‌బుక్ పాత్రపై వాషింగ్టన్ పోస్ట్ కథనాల గురించి మీకు తెలిసే ఉంటుంది' అని జకర్‌బర్గ్‌కు లేఖలో విపక్షాలు పేర్కొన్నాయి.

బీజేపీ సభ్యులు, మద్దతుదారులు ఏ విధంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా విష ప్రచారాన్ని సాగిస్తున్నారన్న వివరాలను అందులో పొందుపరిచాయి. 'అండర్ ఇండియాస్ ప్రెజర్ ఫేస్‌బుక్ లెట్ ప్రాపగాండా అండ్ హేట్‌స్పీచ్ థ్రైవ్' శీర్షికన వాషింగ్టన్ పోస్టులో ప్రచురితమైన వ్యాసం గురించి లేఖలో ప్రస్తావించాయి.

పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం పోరు

- మొద్దునిద్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కనీస అవగాహన లేని సీఎం జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు, కాలువల నిర్మాణాల కోసం ఉద్యమాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టంచేశారు. సాగునీటి పథకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతున్నాయని, దీనిని వదిలించడానికి రోడ్డెక్కాల్సిందేనని ఆయన పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి నరసింహులు అధ్యక్షతన శుక్రవారం రైతుసదస్సు జరిగింది. కుందుర్పి బ్రాంచ్ కెనాల్, బీటీపీ కాలువల నిర్మాణాల సాధన, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని

- మిగతా 2 లో

రూ.42 కోట్ల పట్టివేత

- బెంగళూరు నుంచి తెలంగాణకు తరలింపు
- ఐటీ అధికారుల సోదాల్లో బయటపడ్డ నగదు పెట్టెలు

విశాలాంధ్ర-హైదరాబాద్: కర్ణాటక రాజధాని బెంగళూరులో శుక్రవారం తెల్లవారుజామున రూ.42 కోట్ల నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును తెలంగాణకు తరలిస్తుండగా ఐటీ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. బెంగళూరులోని ఓ అపార్ట్‌మెంట్ నుంచి ఈ నగదును తరలిస్తున్నట్లు ఐటీ అధికారులకు సమాచారం అందడంతో ఐటీ అధికారులు పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించారు. ఇప్పటికే తెలంగాణకు రూ.8 కోట్లు తరలిపోయినట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. కర్ణాటకలో

- మిగతా 2 లో

మోదీ ప్రచారార్భాటం

- రక్షణ రంగం ద్వారా పథకాల ప్రచారం
- జియో ట్యాగ్ సెల్ఫీపాయింట్ల ఏర్పాటుకు ఉత్తర్వులు
- మాజీ సైన్యాధికారుల తీవ్ర అభ్యంతరం
- రాజకీయాలతో సాయుధ దళాలకు ముడి పెట్టొద్దని హితవు

కోల్‌కతా: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రచార్భాటం అంతా ఇంతా కాదు. సొంత ప్రచారం కోసం దేన్నైనా వాడుకోగల సామర్థ్యం ప్రధాని మోదీకి, బీజేపీకి ఉంది. దేశంలో ఎన్నికల నగారా మోగింది. నవంబరులో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ తరుణంలో సొంత ప్రచారం కోసం రక్షణ రంగాన్ని సైతం వాడుకునేందుకు సర్కార్ సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుంది. రక్షణ శాఖ ద్వారా జియో ట్యాగ్డ్ సెల్ఫీ పాయింట్లను

- మిగతా 2 లో

ఆరోగ్య శిబిరాలు మరింత విస్తృతం

- రోగులకు నిరంతరం అండగా ఉండాలి
- జగనన్న ఆరోగ్య సురక్ష సమీక్షలో జగన్ ఆదేశం

3లో

24 గంటల్లో
ఖాళీ చేయండి

గాజాకు ఇజ్రాయిల్ ఆదేశాలు

- మా భూమిని వీడబోం: హమాస్ స్పష్టీకరణ
- ఇది మానవతా సంక్షోభానికి దారి తీస్తుంది: ఐరాస హెచ్చరిక
- సురక్షిత ప్రాంతాల అన్వేషణలో పలస్తీనా ప్రజలు
- సరిహద్దుల్లో భారీగా యుద్ధ ట్యాంకర్లు, సైన్యం మోహరింపు

జెరూసలేం: ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ఏడవ రోజైన శుక్రవారం గాజా స్ట్రిప్‌ను ఇజ్రాయిల్ అష్టదిగ్బంధం చేసింది. ఓవైపు గాజాపై వైమానిక దాడులతో విరుచుకుపడుతూ మరోవైపు భూమి మీద నుంచి దాడులకు ఆ దేశం సిద్ధమైంది. సరిహద్దుల్లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీరు త్వరగా ఆడుకుని వెళ్ళిపోతే...
ఈ గ్రౌండు మేం కబ్జా చేసుకుంటాం!

సుప్రీంలో పెరిగిన ప్రభుత్వ పక్షం
పెండింగ్ కేసులు

ఆర్టీఐ వెల్లడి

న్యూదిల్లీ : ప్రభుత్వం పక్షంగా ఉన్న సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 2019లో 4,536 నుంచి 2023 నాటికి 11,414కు పెరిగినట్లు న్యాయ మంత్రిత్వ శాఖ నుంచి ఆర్టీఐ ప్రతిస్పందన వెల్లడించింది. పూణేకు చెందిన కార్యకర్త విహార్ దుర్వే దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానమిస్తూ, అతను కోరిన రూపంలో సమాచారం లేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత ప్రభుత్వం పక్షంగా ఉన్న సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న మొత్తం కేసుల గురించి '2019 నుంచి 2023 వరకు సంవత్సరం వారీగా పూర్తి సమాచారం' మంత్రిత్వ శాఖ నుంచి దుర్వే అడిగారు. సంబంధిత శాఖ నుంచి నిర్ధారించబడినట్లుగా, ఒక కేసులో ప్రమేయం ఉన్న పక్షాల జాబితా నుంచి పక్షం పేరు శోధన ఆధారంగా ఫలితాలు అంటే, 'యూవోఐ', 'యూ.ఓ.ఐ', 'భారత ప్రభుత్వం', 'యూ ఓ ఐ', 'బ్యాంకు', 'మంత్రిత్వ శాఖ', 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా', 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా', 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' తదితర 2019 నుంచి 2023 వరకు దాఖలయిన కేసుల సంఖ్య, ఇందులో ప్రభుత్వం ఒక పక్షంగా ఉండి ఇంకా సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని

- మిగతా 2 లో

ఎస్‌ఐ అభ్యర్థులకు మళ్లీ దేహదారుఢ్య పరీక్షలు

- మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలంటూ హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఐ పరీక్షలపై హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఎత్తు విషయంలో తమకు అర్హత ఉన్నప్పటికీ అన్యాయంగా తమను అనర్హతకు గురి చేశారని కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరి తరపున హైకోర్టు సీనియర్ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఎత్తు కొలిచే విషయంలో పరికరాల తప్పిదం వల్ల వేలాదిమంది అభ్యర్థులు అర్హత కోల్పోవడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. తొలుత 2019లో అర్హత సాధించిన అభ్యర్థులు 2023లో ఎలా అనర్హతకు గురి అవుతారని ధర్మాసనం ప్రశ్నించింది. ఎత్తులో ఎందుకు తేడా వచ్చిందని నిలదీసింది. అనర్హత పొందిన

- మిగతా 2 లో

ఆక్రమణ ముగిస్తేనే శాంతి

ఇజ్రాయిల్‌ది క్రూరత్వం: పుతిన్

మాస్కో: హమాస్ దాడులకు ప్రతీకారంగా గాజాపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయిల్ చాలా క్రూరమైన పద్ధతులను అనుసరిస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. గాజా స్ట్రిప్ స్వాధీనానికి ఇజ్రాయిల్ చర్యల క్రమంలో మధ్యతూర్పులో పరిణామాల వెనుక లాజిక్‌ను అర్థం చేసుకోగలనని కిర్గిస్తాన్ పర్యటనలో ఉన్న ఆయనన్నారు. గతంలో లెనిన్‌గ్రాడ్ స్వాధీనానికి నాజీ జర్మనీ చేసినట్లుగానే తాజా పరిస్థితులు ఉన్నాయని, ఇవి ఆక్షేపణీయమని తెలిపారు. ఇజ్రాయిల్ ఆకస్మిక దాడులను ఎదుర్కొంది. రెండు వైపులా ఘర్షణ స్థితి ఉంది. అయినాగానీ పౌరుల గురించి ఆలోచించడం ముఖ్యమన్నది నా అభిప్రాయం' అని పుతిన్ అన్నారు.

ఇజ్రాయిల్ మారణహోమంలో గ్రీస్ జోక్యం వద్దు: కేకేఈ

ఏథెన్స్: గాజాపై ఇజ్రాయిల్ దాడులకు అమెరికా, నాటో మద్దతిస్తుండగా, ఇందులో గ్రీస్ జోక్యం వద్దని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) పేర్కొంది. ఆగ్నేయ మధ్యధారాలో గ్రీస్ ఫిగేట్ 'స్పారా' మోహరింపును ఖండించింది. స్పారాను తక్షణమే ఉపసంహరించుకోవాలని గ్రీస్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. పలస్తీనా ప్రజల మారణహోమానికి మద్దతిచ్చే మిషన్‌లకు మద్దతు ఇవ్వవద్దని కోరింది. తమ మిషనకు యుద్ధంతో సంబంధం లేదన్నట్లు చెప్పే ప్రభుత్వ ప్రయత్నాన్ని తోసిపుచ్చింది. తొలి 'బెల్‌హారా' ఫ్రిగేట్ ప్రారంభాన్ని వేడుక చేసుకున్న కొద్ది రోజులకే దాని వాస్తవ ఉద్దేశం బహిర్గతమైందని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. ఫిగేట్ స్పారాను తక్షణమే వెనక్కి తేవాలని, గాజాలో నాటో- అమెరికా- ఇజ్రాయిల్ మారణహోమంతో దేశానికి సంబంధం లేకుండా చూడాలని, 2015లో గ్రీస్ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన 1967 నాటి సరిహద్దులతో పలస్తీనా దేశాన్ని గుర్తించాలనే నిర్ణయానికి కట్టుబడాలని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది.

గాజాలో యుద్ధనేరాలు సుస్పష్టం: ఐరాస

జెరూసలేం: ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరులో అంతర్జాతీయ చట్టం తీవ్రస్థాయిలో అతిక్రమణకు గురవుతోందని ఆక్రమిత పలస్తీనా భూభాగాల దర్యాప్తు కమిషన్ వెల్లడించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. హింసను ఆపేందుకు, సుస్థిర శాంతి నెలకొల్పేందుకు ఏకైక మార్గం పలస్తీనా భూభాగంపై కొనసాగుతున్న అక్రమ ఆక్యుపేషన్‌ను నిలిపివేయడమే అని కమిషన్ నొక్కిచెప్పింది. అలాగే పలస్తీనా ప్రజల స్వీయ నిర్ణయం హక్కు పరిరక్షణ అనివార్యమని పేర్కొంది. దశాబ్దాల్లో జరగనంత హింస చోటుచేసుకుంటోందని వ్యాఖ్యానించింది. అక్టోబరు 7 నుంచి గాజా, ఇజ్రాయిల్‌లో హింస కొనసాగుతోందని తమ నివేదికలో కమిషన్ సభ్యులు తెలిపారు. యుద్ధ నేరాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ చట్టాన్ని అతిక్రమించి, పౌరులను లక్ష్యంగా చేసుకున్న వారంతా యుద్ధ నేరస్తులే అవుతారని హెచ్చరించారు. హింసకు ముగింపు పలకాలంటే ఇజ్రాయిలీ ఆక్యుపేషన్‌కు అంతం అనివార్యమని స్పష్టంచేశారు. యుద్ధాన్ని ఆపడం కోసం పలస్తీనా ప్రజల స్వీయనిర్ణయ హక్కును గుర్తించడం అత్యవసరమని దర్యాప్తు కమిషన్ సభ్యులు నొక్కిచెప్పారు. పౌరులను బందీలుగా చేసి వారిని మానవ కవచాలుగా వినియోగించడం యుద్ధ నేరం కిందకే వస్తుందన్నారు. గాజా స్ట్రిప్ స్వాధీనం... తాగునీరు, ఆహారం, విద్యుత్, ఇంధనం, నిత్యావసరాల సరఫరా నిలిపివేతను తప్పుపట్టారు. ఈ పరిస్థితులు పౌరుల మరణాలను పెంచుతాయని హెచ్చరించారు. ఇది ఉమ్మడి శిక్షగా పరిణమిస్తుందన్నారు. దర్యాప్తులో గుర్తించిన కీలకాంశాలను సంబంధిత న్యాయ అధికారులకు, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ముందర కమిషన్ ప్రవేశపెడుతుందని ఐక్యరాజ్య సమితి ప్రకటన పేర్కొంది. 2021 నుంచి పలస్తీనా పరిస్థితిపై దర్యాప్తు జరుగుతున్నట్లు వెల్లడించింది.

రేపటి నుంచి ఏఐవైఎఫ్ జిల్లాల సమావేశాలు

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవై ఎఫ్) జిల్లా సమితి సమావేశాలు ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించను న్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదిన విశాఖపట్నంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లా సమితి సమావేశాలు జరుపుతున్నామన్నారు. 15న చిత్తూరు, 16న నెల్లూరు, 17న ప్రకాశం, 18న పల్నాడు, 19న బాపట్ల, 20న కృష్ణా జిల్లా, 21న ఎన్టీఆర్ జిల్లా, 27న పశ్చిమ గోదావరి, 28న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ, 29న తూర్పు గోదావరి, 30న కాకినాడ, 31న అల్లూరి సీతారామరాజు, నవంబర్ 1న విజయనగరం, 2న పార్వతీపురం మన్యం, 3న శ్రీకాకుళం జిల్లా సమితి సమావేశాలు నిర్వహించనున్నట్టు రాజేంద్ర, లెనిన్ తెలిపారు.

ఎస్ఐ అభ్యర్థులకు మళ్లీ దేహదారుఢ్య పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులందరినీ మరోసారి దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించి, ఎలక్ట్రానిక్ యంత్రంతో కాకుండా మాన్యువల్‌గా పరీక్షలు నిర్వహించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి సమాచారం ఇచ్చి, ఈ ప్రక్రియ మొత్తం మూడు రోజుల్లోపు పూర్తి చేయాలని ధర్మాసనం పేర్కొంది.

సీఐడీ అధికారుల కాల్‌డేటా పిటీషన్‌పై విచారణ 18కి వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు ముందు, ఆ తర్వాత సీఐడీ అధికారుల కాల్‌డేటా రికార్డులు ఇవ్వాలని కోరుతూ చంద్రబాబు తరపు న్యాయవాదులు వేసిన పిటీషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు. ఇప్పటికే ఈ కేసులో రెండు పక్షాల వాదనలు ముగిశాయి.

మోదీ ప్రచారార్భాటం

(మొదటిపేజీ తరువాయి)

అన్నిచోట్ల ఏర్పాటు చేసేలా ఆదేశాలిచ్చింది. మంచి పనిని ప్రదర్శించడమే ఈ కార్యాచరణ ఉద్దేశంగా చెప్పుకొచ్చింది. సెల్ఫీ పాయింట్లు త్రీ డైమెన్షనల్ (3డీ) శకటాలు కాగా అన్నింటిపైనా ప్రధాని మోదీ ఫొటో తప్పనిసరిగా ఉంటుంది. ఇలా మొత్తం 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయబోతున్నారు. బ్రాడ్ థీమ్‌తో... ప్రభుత్వం వైపునకు దృష్టిని ఆకర్షించే నినాదాలతో సెల్ఫీ పాయింట్లు ఉండాలని ఈనెల 9న కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ సూచనలు చేసింది. ఉదాహరణకు 'ఆత్మనిర్భర్ భారత్' సెల్ఫీ పాయింట్లను రక్షణ రంగ సంస్థలు ఏర్పాటు చేస్తే... త్రివిధ దళాలు 'సాధికరత'పై... రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, రక్షణ తయారీ శాఖ పరిధిలో 'పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలు' సెల్ఫీ పాయింట్లు ఏర్పాటవుతాయి. జాతి నిర్మాణానికి కసరత్తులో భాగంగా సమాజ సేవకు సమయం కేటాయించే క్రమంలో వార్షిక 60 రోజుల సెలవులను సద్వినియోగించాలని సైనికులకు గతనెలలో భారత సైన్యం సూచించినట్లు వార్తలొచ్చాయి. స్వచ్ఛ భారత్, సమగ్ర శిక్ష, గరీబ్ కల్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధీ కేంద్ర, జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్), అటల్ పింఛన్ యోజన, పశుసంపద బీమా, దీనదయాళ్ గ్రామీణ కౌశల్ యోజన, గ్రామ జ్యోతి వంటివాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్థానికంగా చర్చా వేదికలు నిర్వహించాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. సైన్యాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం గురించి సర్వత్రా విమర్శలు వచ్చాయి.

ఎన్నికల వేళ రాజకీయ ప్రచారం కోసం రక్షణ రంగాన్ని వినియోగించుకోవడాన్ని మాజీ సైన్యాధికారులు ఖండించారు. ఈ చర్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాలతో రక్షణ రంగానికి ముడి పెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ ప్రచారాలకు రక్షణ శాఖను దూరంగా ఉంచే ఆనవాయితీని కొనసాగించాలని సూచించారు. ఇదే అంశంపై రిటైర్డ్ జనరల్, మాజీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ వేద్ ప్రకాశ్ మాలిక్ 'ది వైర్'తో మాట్లాడుతూ 'సాయుధ దళాలు... రాజకీయాలకు దూరంగా ఉండాలి. దళాలను రాజకీయం చేసేందుకు ప్రయత్నించరాదు' అని నొక్కిచెప్పారు. ఇలాంటివి సాయుధ దళాలకుగానీ దేశానికిగానీ మంచిది కాదన్నారు. 'మమ్మల్ని వదిలేయండి... మేము రాజకీయాలకు అతీతులం' అన్న శీర్షికన కార్గిల్‌పై తన పుస్తకంలో ఒక అధ్యాయం మొత్తాన్ని రాసినట్లు మాలిక్ తెలిపారు. సైనికులకు రాజకీయాలతో ముడిపెట్టే చర్యల ప్రతికూల ప్రభావం దీర్ఘకాలం పాటు ఉంటుందని మాజీ నావికాధికారి, అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. అసలు ఈ ఆలోచనే సరైనది కాదన్నారు. సెల్ఫీ పాయింట్ల మర్మం తనకు అర్థంకాలేదని చెప్పారు. 'సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయి. రాజకీయ ప్రభావానికి సాయుధ దళాలకు ముడిపెట్టే ఎలాంటి కార్యక్రమం చేపట్టినాగానీ అది ప్రమాద ఘంటికలు మోగించినట్టే అని అన్నారు. ఎంఓడీ ఇలాంటి చర్యలు చేపట్టివుండాల్సింది కాదన్నారు. బలగాల నైతికత, ఐక్యతపై రాజకీయ ప్రేరేపిత హానికరమైన దీర్ఘకాలిక ప్రభావాల గురించి సైన్యాధికారుల నుంచి వివరణను ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

ఇదిలావుంటే మీడియా, కమ్యూనికేషన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ శుక్రవారం సెల్ఫీపాయింట్ల పురోగతిపై రక్షణ మంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే న్యూఢిల్లీ, నాసిక్, ప్రయాగ్‌రాజ్, కొల్లం,పూనే, కోల్‌కతా, బెంగళూరు, గువహటి, మీరట్‌తో కలిపి తొమ్మిది నగరాల్లో సెల్ఫీ పాయింట్లకు కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ ఆమోదం లభించింది. సెప్టెంబరు 14న రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతను జరిగిన సమావేశంలో ఈ సెల్ఫీ పాయింట్ల ఏర్పాటు నిర్ణయం జరిగింది. ప్రజల దృష్టిని ఆకర్షించేలా జనసందోహ ప్రాంతాలలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. యుద్ధ స్మారకాలు, రక్షణ మ్యూజియాలు, రైల్వే-బస్-మెట్రో స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, మాల్స్, స్కూళ్లు, కాలేజీలు, పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేశారు. మోదీ చిత్రపటంతో పాటు ప్రజలను ఆకర్షించేలా సెల్ఫీ పాయింట్లు ఉండాలని రక్షణశాఖ ఆదేశాలిచ్చింది.

చంద్రబాబు ఆరోగ్యంపై అలజడి

(మొదటిపేజీ తరువాయి)

పట్ల దురుద్దేశంతో కుట్రలు పన్నారు. తగినంత భద్రత లేకపోవడంతో చంద్రబాబు ప్రమాదంలో ఉన్నారు. జైలులో భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దోమలు, కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌ఫెక్షన్, అలర్జీతో బాధపడుతున్నారు' అని లోకేశ్ ట్వీట్ చేశారు. కొద్దిసేపటికే చంద్రబాబు ఆరోగ్యంపై నారా బ్రాహ్మణి ఆందోళన వ్యక్తం చేస్తూ మరో ట్వీట్ చేశారు. 'ఆయనను అపరిశుభ్రమైన జైలులో నిర్బంధించడం హృదయవిదారకం. అపరిశుభ్రత ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చంద్రబాబు ఆరోగ్యంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు సకాలంలో వైద్యం అందట్లేదు. ఇప్పటికే ఐదు కేజీల బరువు తగ్గారు. ఇంకా తగ్గితే ప్రమాదం. తక్షణ వైద్య సహాయం అవసరమని అన్నారు. మరోవైపు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై టీడీపీ నేతలు రాజమహేంద్రవరంలో జైలుభరో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై వాస్తవాలు తొక్కిపెడుతూ ప్రభుత్వం ఆయన ప్రాణాలతో చెలగాట మాడుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. టీడీపీ అధినేతకు ఏం జరిగినా వైసీపీ సర్కార్, జగన్ రెడ్డే బాధ్యులని హెచ్చరించారు. డీహైడ్రేషన్, చర్మసంబంధిత సమస్యలతో బాధపడుతున్న చంద్రబాబుని తక్షణమే ఆయన వ్యక్తిగత వైద్యుల పర్యవేక్షణలో కేంద్రప్రభుత్వ వైద్యసంస్థ ఎయిమ్స్‌కు లేక మంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నక్కా ఆనంద్ బాబు, బొండా ఉమామహేశ్వరరావు, కిమిడి కళా వెంకట్రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నెట్టెం రఘురామ్, బుద్దా వెంకన్న, పిల్లి మాణిక్యరావు, కోవెలమూడి రవీంద్ర, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితర ముఖ్యనేతలు అత్యవసరంగా సమావేశమై...దీనిపై నేరుగా సీఎం జగన్‌ను కలిసి వివరిద్దామని నిర్ణయించారు.చంద్రబాబుని రక్షించుకునేందుకు ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని భావించి తాడేపల్లి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు తాడేపల్లిలో సీఎం నివాసం వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుని ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ముఖ్యనేతలంతా ఎక్కడికక్కడ చంద్రబాబు ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగడంతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి ఆఘమేఘాలపై ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి టీడీపీ దుష్ప్రచారానికి దిగిందంటూ విమర్శించారు. డీహైడేషన్ ఏమైనా ప్రాణాంతకమా? అయినా చంద్రబాబు జైలుకి వెళ్లిన తర్వాత కేజీ పెరిగారని తెలిపారు. చంద్రబాబు కోసం ఇంటి నుంచి పంపుతున్న భోజనంపై మంత్రి అమర్‌నాథ్ అనుమానం వ్యక్తం చేశారు.

చంద్రబాబుకి ఏ ఇబ్బందీ లేదు

జైళ్ల శాఖ డీఐజీ

మరోవైపు జైళ్ల శాఖ డీఐజీ రవి కిరణ్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీశ్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి చంద్రబాబు ఆరోగ్యం గురించి వివరించారు. 'చంద్రబాబు స్నేహ బ్లాక్‌లో జైలర్‌స్థాయి అధికారితో పాటు ఏడుగురు హెడ్ వార్డర్లు, వార్డర్లు ఉన్నారు. ఆయన గదిలో మొత్తం ఎనిమిది ఫ్యాన్లు తిరుగుతున్నాయి. భద్రతపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. చంద్రబాబు జైలుకు వచ్చినప్పుడు 66 కేజీలు ఉన్నారు. తర్వాత 68 కేజీలకు పెరిగి ప్రస్తుతం 67 కేజీలకు తగ్గారు. జైలులో ముగ్గురు వైద్యులు ఉన్నారు. చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలుకి వచ్చినప్పుడు వాడుతున్న మందులే వినియోగిస్తున్నారు. డీహైడ్రేషన్ కోసం ఓఆర్ఎస్ ఇచ్చాం. శరీరంపై దద్దుర్లు రావటం వల్ల రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పరీక్షలు చేయించాం. చంద్రబాబు కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రతి రోజూ ఆహారం పరీక్ష చేసిన 50 నిమిషాల తర్వాత చంద్రబాబుకి అందిస్తున్నాం. ఆయనకు ఎటువంటి భద్రత వైఫల్యం లేదు. జైలులో ఖైదీల ద్వారా ఇబ్బంది లేదు' అని తెలిపారు.

రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు

23 వరకు శరన్నవరాత్రులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 15 నుంచి నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నవరాత్రులకు అమ్మవారిని తొలిసారిగా చండీ రూపంలో అలంకరించనున్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం రూ.7 కోట్ల వ్యయం అవుతుందని ఆలయ అధికారాలు అంచనా వేశారు. గత సంవత్సంర మాదిరిగానే ఇటీవల కొండ చరియలు విరిగిపడుతున్నందున క్యూ లైన్లను దుర్గాఘాట్ వైపునకు మార్పు చేశారు. ఈ ఉత్సవాల్లో మొత్తం 10 అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. తొమ్మిది రోజుల్లో చివరి రోజున అమ్మవారిని రెండు రూపాల్లో అలంకరిస్తారు. అక్టోబరు 15న బాలిత్రిపుర సుందరీదేవి అలంకరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 16న గాయత్రీదేవిగా అమ్మవారిని అలంకరిస్తారు. 17న అన్నపూర్ణాదేవిగా, 18న మహాలక్ష్మీదేవిగా, 19న మహాచండీదేవిగా, 20న మూలనక్షత్రం రోజున సరస్వతీదేవిగా, 21న లలితా త్రిపురసుందరీదేవిగా, 22న దుర్గాదేవిగా అలంకరిస్తారు. ఉత్సవాల చివరి రోజు 23వ తేదీ ఉదయం మహిషాసుర మర్దినీదేవిగా, మధ్యాహ్నం రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 20 మూలనక్షత్రం రోజున రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దసరా రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అంతరాలయ దర్శనం ఉండదు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శనాలు ఉంటాయి. భక్తులందరికీ కంకుమ, అన్నప్రసాదం ప్యాకెట్ల రూపంలో ఉచితంగా పంపిణీ చేస్తారు. దసరా రోజుల్లో ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5116, ప్రత్యేక కుంకుమార్చన రూ.3 వేలు, మూలానక్షత్రం రోజున రూ.5 వేలు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. శ్రీచక్ర నవార్చన రూ.3 వేలు, చండీ హోమం రూ.4 వేలు ఉంటుందని తెలిపారు. వీటి టికెట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

సుప్రీంలో చంద్రబాబు క్వాష్ పిటిషన్

విచారణ 17కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మళ్లీ ఈ నెల17వ తేదీకి వాయిదా పడింది. శుక్రవారం కూడా క్వాష్ పిటిషన్‌పై వాదనలు వాడివేడిగా కొనసాగాయి. ఈ కేసులో సెక్షన్ 17ఏ వర్తిస్తుందని చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, ఆ సెక్షన్ వర్తించదని సీఐడీ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ బలంగా వాదించారు. రెండు పక్షాల సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 17 న మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. చంద్రబాబు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ స్కిల్ కేసు విచారణకు ఫైబర్‌నెట్ కేసుతో సంబంధం ఉందన్నారు. మరో కేసులో చంద్రబాబును 16న ప్రవేశపెట్టేందుకు వారెంట్ తీసుకున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇక్కడ కూడా 17ఏను ఛాలెంజ్ చేస్తున్నారా? అని జస్టిస్ త్రివేది ప్రశ్నించగా అవును 17ఏ ప్రతిచోటా వర్తిస్తుందని లూథ్రా తెలిపారు. ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ చట్టాన్ని రద్దు చేసినా, వెనక్కి తీసుకున్నప్పటికీ నేరం జరిగినప్పుడు ఉన్న చట్టమే వర్తిస్తుందన్నారు. కొత్త చట్టం అమలులోకి రాకముందే నేరం జరిగింది కాబట్టి సవరణ చట్టం ఈ కేసుకు వర్తించదన్నారు. "అసలు ఎంక్వయిరీ విషయంలోనే నిరోధం ఉన్నప్పుడు కేసులు ఎలా ఫైల్ చేస్తారు? ఎంక్వయిరీ మీద నిరోధం ఉన్నప్పుడు పోలీసు అధికారి కేసు పెట్టాలని ఎలా నిర్ణయిస్తారు? పోలీసు అధికారికి కేసు నమోదు చేసే అధికారం లేనప్పుడు ఎలా కేసు నమోదు చేస్తారు?" అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. రోహత్గీ స్పందిస్తూ... ఎఫ్ఐఆర్ రద్దు చేయాలన్న అంశంపై ఎంసీ గుప్తా కేసును ప్రస్తావించారు. చట్టం అమలులో ఉన్నప్పుడు జరిగిన నేరాలకు అదే చట్టం వర్తిస్తుందని వాదించారు. 'అధికార విధులు నిర్వర్తించడమంటే అవినీతికి పాల్పడటం కాదు కదా? అధికార విధుల నిర్వహణ ముసుగులో అవినీతికి పాల్పడే పరిస్థితి ఉండ కూడదు' అని రోహత్గీ వాదించారు. చట్ట సవరణ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు... కేసు పాతదే అంటారు అంతేనా? అని జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు. చట్టసవరణ ముందు కేసు కాబట్టే 17ఏ వర్తించదని తన వాదన అని రోహత్గీ తెలిపారు. '17ఏ అనేది పుట్టకముందే నేరం జరిగింది కాబట్టి ఈకేసుకు చట్టసవరణ వర్తించదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ 17కి వాయిదా

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. అంతకు ముందు చంద్రబాబు తరపు న్యాయవాది లూథ్రా వాదనలు వినిపిస్తూ ఫైబర్ నెట్ కేసులో ముగ్గురికి ముందస్తు బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇద్దరికి రెగ్యులర్ బెయిల్ వచ్చిందని, మరికొంతమంది ప్రస్తావన లేదన్నారు. కొందరికి ముందస్తు బెయిల్, మరి కొంతమందికి రెగ్యులర్ బెయిల్ ఉన్నప్పుడు మా క్లయింట్‌కు బెయిల్ ఎందుకివ్వరని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

వాదనల అనంతరం తదుపరి విచారణను సుప్రీంకోర్టు మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

అంగళ్లు కేసులో లక్ష పూచీకత్తుతో ముందస్తు బెయిల్

అంగళ్లు ఘటనలో తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చింది. రూ. లక్ష పూచీకత్తు సమర్పించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు , పోలీసుల తరపున ఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. రెండుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసి శుక్రవారం వెలువరించింది.

పెండింగ్ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ తెలిపింది. సమాచారాన్ని అందజేస్తూ, దాఖలు చేసిన 2019లో కేసుల సంఖ్య 4,536, 2020లో 3,341, 2021లో 3,230, 2022లో 6,159, 2023లో 11,414 కేసులు నమోదయ్యాయి. శుక్రవారం సుప్రీం కోర్టు వెబ్‌సైట్ ప్రకారం, ఈ సంవత్సరం 42,548 నమోదు కాగా, 79,566 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సంవత్సరం 41,723 కేసులు పరిష్కారమయ్యాయి. సుప్రీం కోర్టులో ప్రభుత్వం తరపున వాదించడానికి 2019-23లో 'న్యాయవాదులు, కౌన్సిలర్‌లు, లీగల్ కన్సల్టెంట్‌లు (భారత ప్రభుత్వం లేదా ఏ ప్రభుత్వ ఉద్యోగంలో లేనివారు) చెల్లించిన మొత్తం రుసుము వివరాలను కూడా అతను అడిగాడు. మంత్రిత్వ శాఖ తన ప్రతిస్పందనలో, లా ఆఫీసర్లు, ప్యానెల్ కౌన్సెల్‌లు, కన్సల్టెంట్‌లకు చేసిన చెల్లింపుల వివరాలను అందించింది. ఇది 2018-19లో రూ.32.81 కోట్లు, 2019-20లో రూ. 37.96 కోట్లు, 2020-21లో రూ.32.46గా ఉంది. కోట్లు, 2021-22లో రూ.28.78 కోట్లు, 2022-23లో రూ.31.76 కోట్లు కాగా, రూ.2023-23లో (సెప్టెంబరు 12 వరకు) రూ.19.62 కోట్లుగా ఉంది.

రూ.42 కోట్ల పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

ఓ మంత్రికి చెందిన డబ్బుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ కేసును ఐటీ నుంచి ఈడీకి బదిలీ చేశారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలవడంతో కర్నాటక నుంచి తెలంగాణకు నగదు తరలిస్తున్నారనే సమాచారంతో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 22 బాక్సుల్లో నగదును పెట్టి లారీలో తరలిస్తుండగా ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 9న విడుదలైంది. ఈ సారి ఎన్నికల్లో తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ, మూడోసారి గెలిచి తీరాలని బీఆర్ఎస్ గట్టి పట్టుదలతో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలను విస్తృతం చేశారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం, వెండిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నాలుగు రోజులుగా పోలీసుల తనిఖీల్లో రూ. 37 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. 30 కిలోల బంగారం, 350 కిలోల వెండిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలతో కొంతమంది అధికారులను ఈసీ తొలగించగా, ఆ స్థానంలో కొందరిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

24 గంటల్లో ఖాళీ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధ ట్యాంకర్లు, సైన్యాన్ని భారీగా మోహరించింది. 24 గంటల్లో ఉత్తర గాజా ఖాళీ కావాలని ఇజ్రాయిల్ ఆదేశించింది. ఉత్తర గాజాలోని 1.1 మిలియన్ల (11లక్షల) మంది ఆ ప్రాంతాన్ని వీడాలని హుకుం జారీచేసింది. ఇందుకోసం 24 గంటల అల్టిమేటం ఇచ్చింది. 'గాజా వాసులారా మీరు, మీ కుటుంబాల భద్రత కోసం వెంటనే దక్షిణం వైపునకు వెళ్లిపోండి. మిమ్మల్ని మానవ కవచంగా వాడుతున్న హమాస్ ఉగ్రవాదులకు దూరంగా ఉండండి. రాబోయే రోజుల్లో గాజా నగరంలో ఐడీఎఫ్ చర్యలు తీవ్రతరం కానున్నాయి. పౌరులకు ఎలాంటి నష్టం కలగరాదనే మేము కోరుకుంటున్నాం' అంటూ ఇజ్రాయిలీ రక్షణ దళం సందేశమిచ్చింది. సామాన్యులు తమకు శత్రువులు కాదని, వారిని లక్ష్యంగా చేసుకోవడం తమ ఉద్దేశం కాదని సైన్యాధికారి తెలిపారు. ఇజ్రాయిల్ ఆదేశాలకు తలొగ్గబోమని హమాస్ తేల్చిచెప్పింది. ఇది మా భూమి, దీనిని వీడే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ఆదేశాలను ధిక్కరించింది. ఎవ్వరూ ఎక్కడికి వెళ్లవద్దని పలస్తీనా ప్రజలకు సూచించింది. ఇజ్రాయిల్ తీరును ఐరాస అధికార ప్రతినిధి స్టిఫనే డుజార్రిక్ తప్పుపట్టారు. ఇలాంటి ఆదేశాలు తీవ్రమైన మానవతా సంక్షోభానికి దారితీస్తాయని హెచ్చరించారు. 11 లక్షల మంది ఖాళీ చేయడం సాధ్యం కాదని, వినాశకరమైన పరిణామాలకు ఈ చర్యలు దారితీస్తాయని హెచ్చరించారు. ఇదిలావుంటే గత 24 గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 13 మంది బందీలు చనిపోయారని, ఇందులో విదేశీయులు కూడా ఉన్నారని హమాస్ ప్రకటించింది. కాగా హమాస్ దాడుల్లో ఇజ్రాయిల్‌లో చనిపోయిన వారి సంఖ్య 1300కు చేరుకోగా గాయపడిన వారి సంఖ్య 3,200గా ఉన్నట్లు సైన్యం ట్వీట్ చేసింది. మరోవైపు పలస్తీనా ప్రజలు తమ సామాన్లతో గాజాను వీడుతున్నారు. ప్రాణాలతో ఉండేందుకు సురక్షిత ప్రాంతం కోసం వెతుక్కుంటున్నారు. ఇదిలావుంటే, అటు సరిహద్దుల్లో శక్తిమంతమైన 'నామర్ ఇన్‌ఫ్యాంట్రీ ఫైటింగ్ వెహికల్స్'తో ఇజ్రాయిల్ సైన్యం సిద్ధంగా ఉంది. యాంటీ ట్యాంక్ మిస్సైళ్లను నాశనం చేయగల మెర్కావా-4 ట్యాంకర్లను మోహరించింది. ఏ క్షణంలోనైనా గాజాలోకి అడుగుపెట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది. గాజాలోని ఇరుకైన వీధులు, దాడుల్లో ధ్వంసమైన భవనాల శిధిలాలతో ట్యాంకర్లు ముందుకెళ్లడం సవాళ్లభరితం కావచ్చున్న అభిప్రాయం ఉంది. భూమి మీద హమాస్ ఉనికి లేకుండా చేస్తామని సంకల్పించిన ఇజ్రాయిల్ ఇళ్లల్లోకి చొరబడి దాడి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను సైతం చేసుకుంది.

గుదారాల నగరంగా గాజా

గాజాలో పూర్తిగా దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఆకలి చావులు తప్పబోవన్న ఆందోళనను అంతర్జాతీయ సహాయక బృందాలు వ్యక్తంచేశాయి. ఈజిప్టు సరిహద్దు కూడా మూసి ఉండటంతో వేరే దారి లేక సురక్షిత ప్రాంతం కోసం గాజా వాసులు అన్వేషిస్తూ వీధుల్లో తిరుగుతున్నారు. లక్షల మంది ఐక్యరాజ్య సమితి శిబిరాల్లో శరణ కోరుతుండగా ఇప్పటివరకు 4,23,000 మంది గాజాను వీడినట్లు ఐరాస వెల్లడించింది. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 22వేలకుపైగా ఇళ్లు, 10 ఆసుపత్రులు, 48 పాఠశాలలు ఇప్పటికే ధ్వంసం కాగా సుమారు 1500 మంది చనిపోయారు. ఆరువేల మంది వరకు గాయపడ్డారు. 1500 మందికిపైగా హమాస్ మిలిటెంట్లు హతమైనట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. వేలాది భవనాలను నేలమట్టం కావడంతో గాజా గుడారాల నగరంగా మారుతోంది. హమాస్‌కు చెందిన విమాన నిఘా వ్యవస్థను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ (ఇజ్రాయిల్ రక్షణ దళాలు) ట్వీట్ చేశాయి. గాజా సిటీ, ఖాన్ యూనిస్ రేవుల వద్ద ఉన్న హమాస్ నౌకలను ఇజ్రాయిల్ పేల్చివేసింది.

పలస్తీనా ప్రజలకు ఇరాకీల మద్దతు

బాగ్దాద్: గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడుల వేళ పలస్తీనా ప్రజలకు మద్దతు తెలుపుతూ వేలాది మంది ఇరాకీలు శుక్రవారం బాగ్దాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయిల్ వ్యతిరేకంగా గాజాకు మద్దతుగా ప్రదర్శనకు షియా నేత మొక్తదా సదర్ పిలుపు మేరకు తహ్రీర్ స్క్వేర్ వద్దకు చేరుకున్న ప్రదర్శనకారులు 'నో టు ది ఆక్యుపేషన్! నో టు అమెరికా!' నినాదాలు ఇచ్చారు. పలస్తీనా, ఇరాక్ పతాకాలను ప్రదర్శించారు. పలస్తీనాలో ఇజ్రాయిల్ ఆక్యుపేషన్‌ను... రక్తపాతాన్ని, హక్కుల అతిక్రమణను ఖండించడమే తమ ర్యాలీ ఉద్దేశంగా నిర్వాహకులు అబూ కయాన్ వెల్లడించారు.

నియంత్రించండి : అమెరికాకు ఇరాన్ వినతి

ప్రాంతీయ యుద్ధాన్ని నివారించేందుకు ఇజ్రాయిల్‌ను నియంత్రించాలని అమెరికాకు ఇరాన్ విజ్ఞప్తి చేసింది. లేబనాన్ భద్రతా పరిరక్షణనూ టెహ్రాన్ కోరుతున్నట్లు ఇరాన్ ఉన్నత దౌత్యాధికారి ఒకరు తెలిపారు. 'యుద్ధం తీవ్రతరం కాకుండా నివారించాలని అమెరికన్లు భావించినట్లయితే ఇజ్రాయిల్‌ను నియంత్రించాలి' అని విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం పోరు

(మొదటిపేజీ తరువాయి)

114 చెరువులకు నీరందించాలనే డిమాండ్‌పై రైతులతో రామకృష్ణ ముఖాముఖి నిర్వహించారు. హంద్రీనీవా కాలువ వల్ల భూములు కోల్పోతున్న రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టు ఒక్కటీ నిర్మాణం జరగలేదని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ అంతంత మాత్రమేనన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఏ మాత్రం శ్రద్ధ కనిపించడం లేదని ఆరోపించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ లబ్ధికోసం మోదీ సర్కారు ఎగువభద్రను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడమే కాకుండా రూ.5,600 కోట్లు మంజూరు చేసిందని, ఫలితంగా తుంగభద్ర డ్యామ్‌కు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తాజాగా తెలంగాణ ఎన్నికల కోసం కృష్ణా జలాల పునఃపంపిణీ పేరుతో మరో నాటకానికి తెరలేపిందని రామకృష్ణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌పై మోదీ సర్కారుకు ఏమాత్రం శ్రద్ధ లేదని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాన్ని సీఎం జగన్ గాలికి వదిలేశారన్నారు. పోలవరం సకాలంలో పూర్తికాకపోవడం వల్ల దానిపై ఆధారపడిన రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందడం లేదన్నారు. ఈనెల 18న కడపలో 12 జిల్లాల రైతాంగ సమస్యలపైనా, కృష్ణా, తుంగభద్ర, గోదావరి జలాల కేటాయింపులపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, సాగునీటి రంగ నిపుణులను ఆహ్వానించామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు సాగునీరు అందించడానికి కుందుర్పి బ్రాంచ్ కెనాల్, బీటీపీ కెనాల్‌కు గత ప్రభుత్వం శంకుస్థాపన చేయడమే కాకుండా 70 శాతం పనులు పూర్తి చేసిందని, మిగిలిన పనులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గల ఏకైక మహిళా మంత్రి ఉషశ్రీ చరణ్ చేతగానితనంతో హంద్రీనీవా, బీటీపీ కాలువల నిర్మాణాలు నిలిచిపోయాయని ఆరోపించారు. రైతు సమస్యలపై స్పందించని మంత్రి ఉషశ్రీని ఎక్కడికక్కడ అడ్డుకోవాలని జగదీశ్ పిలుపునిచ్చారు జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు బీమా పరిహారం ప్రకటించలేదని, పోలీసులతో పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సంజీవప్ప, సీపీఐ నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, నాగార్జున, తిరుపాల్, ఆంజనేయులు, ఓంకార్, నాగరాజు నాయక్ హాజరయ్యారు.

ఆరోగ్య శిబిరాలు మరింత విస్తృతం

- రోగులకు నిరంతరం అండగా ఉండాలి
- జగనన్న ఆరోగ్య సురక్ష సమీక్షలో జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆరోగ్య శిబిరాలను మరింత విస్తృతం చేయాలని, రోగ నిర్ధారణ తర్వాత రోగుల ఆరోగ్యం మెరుగుపడే వరకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 1,22,69,512 కుటుంబాలపై ఆరోగ్య సిబ్బంది సర్వే చేపట్టి...3,17,65,600 మందిని కవర్ చేశారని సీఎం జగన్‌కు అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, ఇది రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టనే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ గొప్పతనాన్ని మరింత పెంచుతుందన్నారు. 'రోగులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలి. సదుపాయాలు మెరుగ్గా ఉండాలి. ఇందుకోసం కలెక్టర్లకు మరిన్ని నిధులు ఇస్తాను' అని జగన్ చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కువ ఖరీదైనా రోగులకు మందులు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. క్రమం తప్పకుండా రోగులకు వైద్యపరీక్షలు చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య శ్రీలో కవర్ కాకుండా గతంలో చికిత్సలు చేయించుకున్న పాత రోగుల విషయంలోనూ చేయూత అందించడం మరో బాధ్యతని చెప్పారు. ఆరోగ్యపరంగా, చికిత్సలు, చెకప్‌లు, మందులపరంగా ఎవరికి ఏ అవసరాలు ఉన్నా తీర్చాలని తెలిపారు. ప్రతి నెలా మండలంలో నాలుగు సచివాలయాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, రోగుల సంతృప్తి, క్యాంపుల్లో సదుపాయాలు, రోగులకు చేయూతనందించడం, ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన, విస్తృత ప్రచారంపై తప్పనిసరిగా సమీక్ష చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆరోగ్య సురక్షపై ప్రతివారం తన వద్ద సమీక్ష జరగాల్సిందేనని జగన్ ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీని వినియోగించుకోవడం తెలియని రోగి ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ చేయడం వల్ల పర్యవేక్షణ మరింత సులభతరమవుతుందన్నారు. ఇప్పటివరకూ 5216 ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించామని, సగటున ఒక్కో క్యాంపులో 357 మంది వస్తున్నట్టు అధికారులు తెలియజేశారు. అనంతరం ఆసుపత్రుల్లో నాడు-నేడు పనులు, కొత్త మెడికల్ కాలేజీలు, అర్బన్ హెల్త్ క్లినిక్కుల నిర్మాణ పురోగతి పనులను సీఎం సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక సీఎస్ (ఎఫ్ఏసీ) అజయ్ జైన్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి (కోవిడ్ 19) మంజుల డి హోస్మణి, ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ డైరెక్టర్ జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి.మురళీధర్, ఆరోగ్యశ్రీ సీఈఓ హరేంధిర ప్రసాద్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ప్రభుత్వ ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ బి.చంద్రశేఖరరెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ సాంబశివారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

లోకేశ్ ప్రకటన అర్థరహితం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మతోన్మాద బీజేపీ అధ్వర్యంలోని ఎన్డీఏ కూటమికి, లౌకికవాద ఇండియా పక్షానికి సమదూరంలో ఉంటామని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన ప్రకటన అర్థరహితమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అమిత్‌షా మాటలు నమ్మి బీజేపీ వలలో పడితే టీడీపీ సాధించేదేమీ ఉండబోదన్నారు. తనను కలసిన మీడియా వారితో శుక్రవారం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇండియా కూటమిలో చేరుతారా లేదా అనేది తెలుగుదేశం పార్టీ ఇష్టమని, సమదూరం పేరుతో మతోన్మాద బీజేపీకి సానుకూలంగా వ్యవహరించడం ప్రమాదకరమని హెచ్చరించారు. మతోన్మాదానికి, లౌకికవాదానికి సమదూరం పాటించటమంటే మతోన్మాదానికి మేలు చేయడమేనని, రాష్ట్రానికి బీజేపీ చేసిన ద్రోహాన్ని విస్మరించడం అన్యాయమని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుతో తమకు సంబంధం లేదని చెబుతున్న బీజేపీ అధినాయకత్వం ఇంతకాలం ఎందుకు మౌనం వహించిందో చెప్పాలన్నారు. ఈ విషయంలో టీడీపీ శ్రేణులను నమ్మించాలని చూడటం మోసకారితనమవుతుందన్నారు. బీజేపీ మతోన్మాదం, రాష్ట్రానికి చేసిన విద్రోహంపై టీడీపీ శ్రేణులను తప్పుదారి పట్టించవద్దని ఆ పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ భవిష్యత్తు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మతోన్మాద బీజేపీని వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు.

డీ హైడ్రేషన్ ఏమైనా ప్రాణాంతకమా?

సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రెండు, మూడు రోజులుగా కొత్త డ్రామాకు తెలుగుదేశం పార్టీ నాయకులు తెర లేపారని, దాన్ని మరింత రక్తి కట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబు ప్రాణాలకు ముప్పు ఉందని టీడీపీ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, జైలు ఏమన్నా అత్త గారిల్లా ? అని ప్రశ్నించారు. టీడీపీ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, చంద్రబాబు బరువు తగ్గలేదని, ఒక కేజీ పెరిగారని జైళ్ల శాఖ డీఐజీ స్వయంగా చెప్పారని వివరించారు. చంద్రబాబు చర్మ సంబంధిత సమస్యలపై వైద్యులు అవసరమైన అన్ని ఔషధాలు ఇస్తున్నారన్నారు. చంద్రబాబుకు జైలులో వీలైనన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించారన్నారు. ఒక బ్యారెక్‌ను పూర్తిగా ఖాళీ చేయించి ఉంచారని, రోజంతా వైద్య నిపుణులు అక్కడే అందుబాటులో ఉంటారని చెప్పారు. ఇంటి నుంచి ఆహారం, మంచినీరు అనుమతిస్తున్నారన్నారు. ఎలాగైనా చంద్రబాబును బయటకు తీసుకురావాలని, హైదరాబాద్‌లో ఫైవ్ స్టార్ ఆస్పత్రిలో చేర్పించాలన్నదే వారి స్కెచ్ అని మండిపడ్డారు. చంద్రబాబుకు ఐటీ నోటీసులు కూడా మేమే ఇచ్చామా..?, అది ఎవరి పరిధి? అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టులో బీజేపీ ప్రమేయం ఉందని టీడీపీ వెబ్ సైట్‌లో రాసుకున్నది మీరా?, మేమా? అని నిలదీశారు. ఇన్నర్ రింగ్‌రోడ్‌లో హెరిటేజ్ కొన్న 10 ఎకరాల్లో 25సెంట్లే పోయిందని చెప్పారు. ఏ కంపెనీ అయినా పొలాల మధ్య భూమి కొంటుందా?, ముందుగానే భూమి కొని అలైన్‌మెంట్ మార్చారన్నారు. అది పక్కా స్కెచ్‌తో చేసిన ఒక భారీ కుంభకోణం అని సజ్జల చెప్పారు.

దిల్లీలో లోకేశ్ డ్రామా

ఇక దిల్లీలో లోకేశ్ మరో డ్రామాకు తెరతీశారని సజ్జల మండిపడ్డారు. మొన్న దిల్లీలో హోం మంత్రితో కలిసి, లోపల ఏం మాట్లాడారో కానీ బయటకు వచ్చి ఏం చెప్పారు?, అని ప్రశ్నించారు. ఇక్కడ ప్రజలు ఒకటే అర్థం చేసుకోవాలని, మాకు ఇలా రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబు తప్పు చేశాడనో, ఆధారాలతో సహా దొరికిపోయి, అరెస్టు అయ్యాడనో, దాంట్లో మా ప్రభుత్వ ప్రమేయం ఏముంటుంది? అని అన్నారు. చంద్రబాబుకు అనారోగ్యం కలిగితే, అది ఆయన ఆహారం వల్లనే రావాలని, ఆయనకు ఆహారం ఏమిస్తున్నారో వారికే తెలియాలన్నారు. స్టెరాయిడ్స్ ఎందుకు ఇస్తారు? జైల్లో ఆయనకు వీలైనన్ని సదుపాయాలు కల్పించామని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: మెడికల్ రంగంలో పనిచేస్తున్న శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని సమస్యల పరిష్కారం కోసం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ దసరా తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మునెప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ మెడికల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లకు 2020 జనవరి ఒకటో తేదీ నుంచి జీవో నంబర్ 549 ప్రకారం 16,000 వేల రూపాయల వేతనం చెల్లించాల్సి ఉండగా ఇప్పటికీ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. జీవో నంబర్ 43 ప్రకారం రూ.11,800 చెల్లించాల్సి ఉండగా 9000, 10000 మాత్రమే కాంట్రాక్టర్లు ఇస్తున్నారని తెలిపారు. హాస్పిటల్లో సూపరిటెండెంట్‌లు, ఉన్నతాధికారులు కార్మికులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. ప్రతి నెల కార్మికులకు ఏడవ తేదీన జీతాలు చెల్లించాలని ఉన్నప్పటికీ ఎక్కడా ఇది అమలు జరగడం లేదన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పూదోట ప్రకాశ్ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేయలేని కాంట్రాక్టర్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శానిటేషన్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేది ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆందోళన కార్యక్రమాల వివరాలతో వినతి పత్రాలు అందజేయాలని సూచించారు. నవంబరు 8వ తేదిన చలో విజయవాడ నిర్వహించాలన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు వాయిదా

ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా దసరా సెల వులలో ఉపాధ్యాయులకు ప్రతిపాదించిన శిక్షణ తరగతులను వాయిదా వేసినట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర విద్యా, శిక్షణ పరిశోధన సంస్థ (ఎస్ఈఆర్టీ) సంచాలకులు బి.ప్రతాపరెడ్డిని శుక్రవారం ఎస్టీయూ నేతలు కలిసి దసరా సెలవులు, ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా తరగతుల పైన చర్చించి, వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు దసరా సెలవులలో, దసరా పర్వదినం పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలను కుటుంబ సభ్యులతో కలసి నిర్వహించుకుంటారని వివరించారు. అందువల్ల సెలవుల్లో ప్రతిపాదించిన రెండు విడుతల వృత్యంతర శిక్షణ తరగతులను వాయిదా వేయాలని కోరామన్నారు. దసరా సెలవులు అన్ని రకాల మనేజ్‌మెంట్ పాఠశాలలకు ఈనెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వర్తింప జేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రతాపరెడ్డి స్పందిస్తూ, శిక్షణ తరగతులు వాయిదా వేస్తున్నామన్నారు. దసరా సెలవులు క్రైస్తవ మిషనరీ పాఠశాలలకు, మిగతా పాఠశాలలకు వేరువేరుగా ఉంటాయని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరిచామని ఆయన గుర్తు చేశారు. క్రైస్తవ మిషనరీ పాఠశాలలకు దసరా సెలవులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఉంటాయని, మిగిలిన పాఠశాలలకు 14 నుంచి 24 వ తేదీ వరకు ఉంటాయని వివరించారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్ష ప్రశ్నా పత్రాలు నల్లబల్లపై రాసి పరీక్షలు రాయించడం ఇబ్బందికరంగా ఉందని, గతంలో మాదిరిగానే ప్రశ్నాపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తే బాగుంటుందని తాము విజ్ఞప్తి చేయగా, భవిష్యత్తులో ప్రశ్నాపత్రాలు ముద్రించి పంపిణీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారన్నారు.

ప్రజలు షాక్ ఇచ్చే సమయం ఆసన్నం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: ప్రజలపై విద్యుత్ చార్జీల మోత మోగించిన జగన్ ప్రభుత్వానికి ప్రజలు షాక్ ఇచ్చే సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద శుక్రవారం ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్‌రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని అన్నారు. మన రాష్ట్రంలో 30 సంవత్సరాల పాటు వ్యవసాయానికి అందించే విద్యుత్తు మొత్తం తయారు చేసే ఒప్పందం అదానితో చేసుకున్నారని, విదేశాల బొగ్గు సరఫరా చేసేందుకు బొగ్గు రవాణా చేసే ఓడరేవులు అదానీవే అని అన్నారు. తాజాగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీని అదానీ ప్రారంభించారన్నారు. ఇలా విద్యుత్ రంగం మొత్తం అదానీ, ఇతర బడా కార్పొరేట్‌ల గుప్పెట్లోకి వెళ్లిపోతోందని, కేంద్ర ప్రభుత్వం తన మిత్రబృందం కోసం ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటు పరం చేయటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు రూపాయలకు కొనాల్సిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో రూ.10 నుంచి రూ.20కు కొంటున్నారని, ఇందులో భారీఎత్తున అవినీతి చోటు చేసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే నిబంధనలకు విరుద్ధంగా హిందుజా సంస్థకు రూ.1200 కోట్లు అప్పనంగా చెల్లించారని సర్దుబాటు చార్జీల పేరుతో మళ్లీ ఈ భారాన్ని ప్రజలపై మోపటానికి సిద్ధమవుతున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకి మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ ఎసరు పెట్టబోతున్నారని, 200 యూనిట్లు లోపు విద్యుత్ వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి జగన్ మోసం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ క్రమంగా నీరుకారుస్తున్నారని, చిరు వ్యాపారులకు విపరీతంగా రేట్లు పెంచారని, వ్యాపార సంస్థలు, పరిశ్రమలపై భారం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్దుబాటు చార్జీల బాదుడు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలకు గుదిబండగా మారిన విద్యుత్ చార్జీల బాదుడును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతి జగన్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినికాంత్, సీపీఐ ఎంఎల్ నాయకులు గనిరాజు, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు, పచ్చల శివాజీ, ఆకిటి రామచంద్రుడు, సీపీఎం నాయకులు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మోసకారి మోదీని సాగనంపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-మోపిదేవి : మోసకారి మోదీని సాగనంపాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మోపిదేవి మాజీ సర్పంచ్ కంఠంనేని అచ్చుతరామయ్య 12వ వర్ధంతి మోపిదేవిలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అచ్చుతరామయ్య అని నివాళులర్పించారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా దివిసీమ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాలలో ముందుండి నడిచారని కొనియాడారు. కేంద్రంలో మతతత్వ బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ప్రజలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సమాజాన్ని సర్వనాశనం చేస్తున్నాయన్నారు. తమ ఆధీనంలో ఉన్న సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీల మీద, ప్రజా సంఘాల మీద వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకువచ్చి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. దిల్లీ సరిహద్దులో 750 మంది రైతులు ప్రాణత్యాగం చేసి రైతాంగ ఉద్యమాన్ని నిలబెట్టుకోవాల్సి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టాలనే దురాలోచనతో మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందుకు రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. అచ్యుత రామయ్య లాంటి మహనీయులు చూపిన పోరుబాటలో నేటి తరం నాయకులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో దివిసీమ ప్రాంతానికి చారిత్రాత్మక పాత్ర ఉందని, దానిలో అచ్చుతరామయ్యకు ఒక పేజీ ఉంటుందని తెలిపారు. ఆయన జీవన విధానం ఈనాటి కమ్యూనిస్టులకు ఆదర్శనీయమన్నారు. తొలి తరం కమ్యూనిస్టు నాయకులు వారి జీవితాలను త్యాగం చేసి కమ్యూనిస్టు పార్టీని నిర్మించారని తెలిపారు. వారు చూపిన బాటలో నడిచిన అచ్చుతరామయ్య తన కుటుంబ సభ్యులను సైతం అదే త్రోవలో నడిపించారని కొనియాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ప్రశ్నించే గొంతుక లేకుండా పరిపాలన సాగించాలనే అహంకార ధోరణిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉన్నాడని విమర్శించారు. ప్రజా ఉద్యమాలపై దమనకాండ ప్రదర్శిస్తూ తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే ఆదేశాలను పోలీసులు పాటిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఉద్యమకారులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు కేసులకు భయపడి ఉంటే నేటికీ దివిసీమ ప్రాంతంలో చల్లపల్లి జమీందారులు రాజ్యమేలే వారని, ఆనాడు చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి జమీందారి పాలనకు చరమగీతం పాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నాననే ముఖ్యమంత్రి ప్రజల్లోకి రావడానికి ఎందుకు భయపడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో 50 వేల ఇళ్లకు శంకుస్థాపన చేయడానికి హెలికాప్టర్‌లో ఎందుకు రావాల్సి వచ్చిందని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే కక్ష సాధింపు పాలన సాగిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత అచ్చుతరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, పార్టీ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ఎంపీపీ రావి దుర్గా వాణి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, ఉపాధ్యక్షులు సురేంద్రనాథ్ బెనర్జీ అచ్యుతరామయ్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావి ప్రభు ప్రసాద్, బండి రామకృష్ణ, మల్లిపెద్ది బోసు, పెనుముత్స ప్రభాకర్ రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, రాజారత్నం, కంఠంనేని కుటుంబరావు, అచ్యుతరామయ్య కుటుంబ సభ్యులు పాలడుగు రత్నబాబు, కంఠంనేని జోత్స్నాదేవి, కంఠంనేని కృష్ణకుమారి, కంఠంనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీ పాత్ర కీలకం

బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ వినోద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీ ప్రముఖ పాత్ర వహిస్తోందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ సీనియర్ డైరెక్టర్ హెడ్ వినోద్ చెప్పారు. విజయవాడ మినర్వా గ్రాండ్‌లో ప్రపంచ ప్రమాణాల దినోత్సవం-2023 నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్డీజీ 3-గుడ్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ అనే అంశంపై టెక్నికల్ సదస్సు ఏర్పాటు చేశారు. వినోద్ మాట్లాడుతూ ప్రామాణీకరణ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు అందించిన సహకారాన్ని స్మరించుకోవడానికి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపుకుంటారన్నారు. అంతర్జాతీయ ప్రమాణీకరణ, అంతర్జాతీయ ఎలక్ట్రో-టెక్నికల్ కమిషన్, అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ అనే మూడు అంతర్జాతీయ స్టాండర్డైజేషన్ బాడీ అధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా వేలాదిమంది నిపుణుల సహకారానికి నివాళులర్పించడం కోసం ఈ వేడుక జరుగుతుందని వివరించారు. ప్రపంచ జనాభా కోసం సమర్థవంతమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన వైద్య పరికరాలు, ఆరోగ్య సేవలు, వ్యవస్థపై స్వదేశీ ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో బీఐఎస్ ఎలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే అంశాల్ని వివరించారు. వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీల పాత్రను చెప్పారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సుజాత స్వాగతోపన్యాసం చేస్తూ జీవితంలో ప్రమాణాలు పోషించే పాత్రను వివరించారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ ఈ ఏడాది ప్రపంచ ప్రమాణాల దినోత్సవ సందేశం చదివి వినిపించారు. వచ్చే పదేళ్లలో వైద్యారోగ్య సంరక్షణ పరికరాలు, వ్యవస్థల తయారీలో గణనీయమైన వృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేశ్ త్రిపాఠి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ప్రొఫెసర్ డాక్టర్. జి.మోహన్ రోవా, డాక్టర్ బి.చంద్రశేఖర్, సాయి కుమార్, బీఐఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగస్థల సమాజాలకు వైఎస్ఆర్ పురస్కారం

పోసాని కృష్ణ మురళి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు నాటక రంగం ప్రోత్సాహానికి, అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న రంగస్థల సమాజాలకు, పరిషత్‌లకు ఈ ఏడాది నుంచి వైఎస్సార్ రంగస్థల పురస్కారం కింద రూ.5 లక్షల నగదు బహుమతిని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. వెలగపూడిలోని సచివాల యం నాల్గో బ్లాక్ ప్రచార విభాగంలో పోసాని కృష్ణ మురళి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మాజీముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని పోసాని చెప్పారు. 2004 వరకు నంది నాటక అవార్డుల కోసం ఎంపిక కార్యక్రమం హైదరాబాదు రవీంద్రభారతిలోనే నిర్వహించేవారని చెప్పారు. ఈ నాటక పోటీల్లో పాల్గొనేందుకు అనేకమంది కళాకారులు హైదరాబాదు వచ్చేందుకు వ్యయప్రయాసలు ఎదుర్కొనే వారన్నారు. రాష్ట్రంలోని కళాకారుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి విశేషంగా కృషిచేసిన రాజశేఖర్‌రెడ్డి పేరుతో వైఎస్సార్ రంగస్థల పురస్కారాన్ని ఈ ఏడాది నుంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఈ పురస్కారం కింద తెలుగు నాటకరంగం ప్రోత్సా హానికి, అభివృద్ధికి కృషిచేస్తున్న రంగస్థల సమాజాలకు, పరిషత్‌లకు రూ.5 లక్షల నగదు బహుమతి ఇస్తామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని, ఉత్తమ మైన రంగస్థల సమాజాలను, పరిషత్‌లను ఎంపిక చేసేందుకు ముగ్గురు న్యాయనిర్ణేతలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నాటక రంగ కళాకారులకు ఇప్పటివరకు అందజేస్తున్న ఎన్టీఆర్ రంగస్థల పురస్కారాలను కొనసాగిస్తున్నామని, ఇందుకోసం రూ.1.50 లక్షల నగదు బహుమతి అందజేస్తా మన్నారు. నంది నాటక అవార్డులకు తుది ఎంపిక గుంటూరులో ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ప్రాథమిక ఎంపిక పూర్తయిందని, ఈ ప్రాథమిక ఎంపికలో మొత్తం 115 నాటకాలు, నాటికల ప్రదర్శనను వీక్షించి...అందులో 38 నాటకాలు, నాటికలను తుది ప్రదర్శనకు ఎంపిక చేశామన్నారు. తుది ఎంపికను నవంబరు చివరి వారం లేదా డిసెంబరు మొదటివారంలో గుంటూరు లోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాకారులు అందరికీ ప్రత్యేకించి జూనియర్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు గుర్తింపు కార్డులు జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అర్హులు ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పోసాని కోరారు.

హెచ్‌ఓడీ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ హెచ్‌ఓడీ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గొల్లపూడిలోని ఎండోమెంట్ విభాగ సమావేశ మందిరంలో జరిగిన ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఏపీ ఎన్‌టీవో సంఘం కోశాధికారి ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన భవిరి రవి మాట్లాడుతూ సభ్యులు ఏమైన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించటానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. నూతన కమిటీ సభ్యులకు దేవాదాయ శాఖ ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

అధ్యక్షులుగా భవిరి రవి, కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, ఫైనాన్స్ సెక్రటరీగా టి.హేమసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.రామస్వామి, ఉపాధ్యక్షులుగా వి.ఏడుకొండలు, ఉప కార్యదర్శిగా శరత్ బాబు ముగ్గురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర కోశాధికారి ఏ.రంగారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కే.జగదీశ్వరరావును ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేట్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

సంపాదకీయం

మారుతున్న ఎన్నికల ఎత్తుగడలు

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల శాసనసభల ఎన్నికల కార్యక్రమం నవంబర్ ఏడు నుంచి ఆ నెల 30 దాకా ఎన్నికలు కొనసాగుతుందని ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఎన్నికల నగారా మోగింది. ఈ నగారా అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలకే పరిమితం అయినట్టు లేదు. 2024 ఏప్రిల్-మే నెలల్లో జరగవలసిన సార్వత్రిక ఎన్నికల మీద కూడా వివిధ రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో కులగణన ప్రధాన చర్చనీయాంశంగా ఉండబోతున్నట్టుగా ఉంది. అక్టోబర్ రెండవ తేదీన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కులగణన వివరాలను ప్రకటించడంతో ఈ అంశానికి విశేషమైన ప్రాధాన్యత వచ్చింది. బీజేపీ మినహా దాదాపు అన్ని పార్టీలు దేశవ్యాప్తంగా కులగణన కావాలని పట్టుబడుతున్నాయి. ఇతర వెనుకబడిన తరగతుల వారికీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికీ ఎంతో కొంత మేర రిజర్వేషన్లు అమలవుతున్నాయి. కానీ ఈ రిజర్వేషన్లు నికరమైన గణాంకాల ఆధారంగా సాగడంలేదు. కులాలా వారీ జనాభా లెక్కలు ఆఖరి సారి 1931లో జరిగాయి. స్వాతంత్ర్యం తరవాత ఆ పద్ధతి నిలిచిపోయింది. 1931 జనాభా లెక్కల ప్రకారం ఇతర వెనుకబడిన తరగతుల వారి జనాభా 52 శాతం ఉందని అంచనావేసి వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. అయితే బిహార్ కులగణన బయట పెట్టిన సమాచారం ప్రకారం ఇతర వెనుకబడిన తరగతుల వారు 63 శాతం ఉన్నారు. బిహార్ కులగణనలో అత్యంత వెనుకబడిన వర్గాలవారు 36.02 శాతం ఉంటారని తేలింది. అంటే బిహార్‌లో పేదలు ఎంతమంది ఉన్నారో ఒక అంచనాకు రావడానికి అవకాశం వచ్చింది. ఈ గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కూడా మారితేనే ఈ లెక్కలకు సార్థకత. బిహార్ లో కులగణన జరిపించి నితీశ్ కుమార్ వెనుకబడిన వారి హక్కులకోసం పోరాడుతున్న నాయకుడనిపించుకున్నారు. నిజానికి కులగణన నిర్వహించిన వారిలో నితీశ్ మొదటి వారేమీకాదు. కాంగ్రెస్ హయాంలో కర్నాటకలో ఇలాంటి లెక్కలు సేకరించారు. కానీ వీటి ఫలితాలను వెల్లడించే లోగానే అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం పతనమైంది. ఆ తరవాత వాటిని పట్టించుకున్న వారు లేరు. కానీ నితీశ్ కులగణన వివరాలు వెల్లడించిన తరవాత లాలూ ప్రసాద్ యాదవ్, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే దేశవ్యాప్తంగా కులగణన జరగాలంటున్నారు. కులగణన వివరాలు రిజర్వేషన్లను హేతుబద్ధం చేయడానికి ఉపకరిస్తాయి.

బిహార్‌లో కులగణన వివరాలను పరిశీలిస్తే పేదలసంఖ్య ఎంతో తేల్చవలసిన ఆవశ్యకత ఉందనిపిస్తోంది. పేదలు ఎంతమంది అన్నది నికరంగా తేలితే ప్రభుత్వాలు తదనుగుణమైన విధానాలు రూపొందించవచ్చు. ఈ వివరాలు కేవలం రిజర్వేషన్లకే పరిమితమైనవి కావు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటును ఆమోదించినప్పటికీ అందులో మళ్లీ ఓబీసీ మహిళలకు స్థానం కల్పించలేదన్న అంశం తీవ్రంగానే చర్చకొస్తోంది. తమ హయాంలో ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదించినప్పుడు మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం తమ తప్పేనని రాహుల్ గాంధీ బహిరంగంగానే ఒప్పేసుకున్నారు. బీజేపీ చాలా చాకచక్యంగా మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినట్టే ఆమోదించి అమలును వాయిదా వేసింది. ఎంత తొందరగా అమలు చేద్దాం అనుకున్నా 2029లోగా అమలయ్యే అవకాశం లేదు. నిజానికి అప్పటికి జనాభా లెక్కల సేకరణ, నియోజక వర్గాల పునర్విభజన పూర్తి కావాలని బీజేపీ మెలిక పెట్టింది. మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించడానికి నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధమే లేదు. అది సాకు మాత్రమే.

ఇటీవల వెలువడిన కులగణన వివరాల ప్రకారం తమ రాష్ట్రంలో రిజర్వేషన్లలో మార్పులు చేస్తామని నితీశ్ అంటున్నారు. ఈ ప్రభావం 2024 ఎన్నికల మీద కచ్చితంగా ఉంటుంది. డిసెంబర్ లో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలలో కులగణన వివరాలను సభలో ప్రతిపాదిస్తామని నితీశ్ చెబుతున్నారు. విద్యాపరమైన, సామాజిక-ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన లెక్కలను కూడా వెల్లడిస్తామంటున్నారు. కులగణనలో వెల్లడైన గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలంటే రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదన్న సుప్రీంకోర్టు విధించిన పరిమితి ఆటంకం కలిగించవచ్చు. బిహార్‌తో పాటు కొన్ని చోట్ల ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన వారికి కొద్దో గొప్పో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లు రాజ్యాంగం రూపొందినప్పుడు నిర్దేశించిన పరిధులు దాటేసింది. ఇతర వెనుకబడిన తరగతుల వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన సమయంలో సుప్రీంకోర్టు వెనుకబడిన తరగతుల వారిలో "సంపన్నవర్గం" అనే కొత్త అంశాన్ని జోడించింది. సంపన్న వర్గాన్ని రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తున్నామంటే రాజ్యాంగం నిర్దేశించిన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు అనే సూత్రాన్ని విస్తరించినట్టే. రాజ్యాంగం ప్రస్తావించని ఆర్థికాంశాన్ని రిజర్వేషన్ల కల్పనలో అంగీకరించినట్టే. ఇప్పుడు బిహార్ కులగణనలో అత్యంత వెనుకబడిన వారు 36.02 శాతం ఉన్నారని తేలింది. అత్యంత వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ చేయూత అందివ్వాల్సిందే. కానీ మళ్లీ ఆర్థికాంశాన్ని జోడించవలసి వస్తుంది. వెనుకబడిన తరగతుల వారికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలంటే 50 శాతం పరిమితిని అధిగమించాల్సిందే. రాహుల్ గాంధీ "జిత్నీ ఆబాదీ-ఉత్నీ హక్" (జనాభా ఎంతో హక్కు అంతే) అన్న నినాదం రూపొందించారు. అప్పుడూ 50 శాతం పరిధిని అధిగమించవలసిందే. బీజేపీ మినహా "ఇండియా" ఐక్య సంఘటనలోని అత్యధిక పార్టీలు కులగణనకు అనుకూలమేనని రాహుల్ గాంధీ చెప్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష "ఇండియా" ఐక్య సంఘటన తమ విధానాలకు పదును పెడ్తున్నాయి. దళితులను, అత్యంత వెనుకబడిన తరగతుల వారిని, అణగారిన వర్గాల వారిని ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ ఉత్తర ప్రదేశ్ విభాగం "దళిత్ గౌరవ్ సంవాద్" కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని కాన్షీ రామ్ వర్ధంతి రోజున ప్రారంభించడానికి ప్రాధాన్యం ఉంది. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కనీసం పదిచొప్పున నాలుగువేల చౌపాల్‌లు నిర్వహించాలని కాంగ్రెస్ సంకల్పించింది. ప్రతి లోకసభ నియోజకవర్గం స్థాయిలో జనంతో సంవాదం కొనసాగించాలనుకుంటోంది. లక్షమంది దళితులతో నేరుగా మాట్లాడాలనుకుంటోంది. కనీసం రెండులక్షల మంది దళితులు తమ డిమాండ్ల పత్రాలు నింపేట్టు చూడాలని కాంగ్రెస్ భావిస్తోంది. కర్నాటకలో నిర్వహించిన కులగణన వివరాలను త్వరలో వెల్లడిస్తామని రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ ప్రకటించారు. కులగణన మన దీర్ఘకాలిక లక్ష్యమైన కుల నిర్మూలనకు ఉపకరించక పోవచ్చు. కానీ నికరమైన లెక్కల ఆధారంగా రిజర్వేషన్లనే కాక వివిధ పథకాలకు పదును పెట్టడానికి తప్పకుండా ఉపకరిస్తుంది.

రాజస్థాన్ బీజేపీలో కుమ్ములాటలు

జ్ఞాన్ పాఠక్

రాజస్థాన్ అసెంబ్లీకి నవంబరు 23వ తేదీన ఎన్నికలు జరుగుతాయని మొదట ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఆ తరువాత నవంబరు 25కు మార్చింది. రాష్ట్రంలో భారీగా వివాహాలు జరగనున్నందున ఈ మార్పు చేసినట్లు వెల్లడైంది. బీజేపీలో మూడు గ్రూపులు ఏర్పడి తగాదాపడుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సహజంగా ఉండే వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. టిక్కెట్ల కోసం ఎదురుచూస్తున్న బీజేపీ నాయకులు కనీసం ఐదుమంది నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదుగురికి టిక్కెట్లు ఇవ్వలేదు. మొదటి జాబితాలో 41మంది పేర్లను ఈ నెల 9వతేదీన ప్రకటించారు. దీనితో ఐదుగురు నాయకులు వాళ్లపరిధిలో ఉండే కార్యకర్తలు తీవ్ర నిరసన తెలిపారు. ఒక నాయకుడికి చెందిన కార్యకర్తలు బీజేపీ జండాలను తగలబెట్టారు. అన్ని పార్టీలలోనూ అసంతృప్తి ఉంటుందిగానీ, బీజేపీలో తగాదాలు మరింత తీవ్రంగాఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వీరిపై ఆగ్రహంగా ఉన్నారు. 2024లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో మారోసారి గెలుపంది అధికారం చేపట్టాలనుకుంటున్న మోదీ పార్టీలోఉన్న పరిస్థితులపై వివిధ గ్రూపుల నాయకులతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. గత లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న 25 లోకసభ సీట్లు గెలుచుకున్నప్పటికీ ఈ సారి పరిస్థితి భిన్నంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఎన్నికలకు ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. పార్టీలో తగాదాలు పరిష్కరించేందుకు అనేక విధాలుగా రాష్ట్ర, కేంద్ర నాయకులు ప్రయత్నించారు. బీజేపీ రాష్ట్రంలోనే 200 సీట్లలోనూ ఓకే చేయనున్నట్లు ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే అనుచరులు తమ నాయకురాలిని పక్కకు నెట్టివేసారని ఆగ్రహం ప్రకటిస్తున్నారు. మొదటి జాబితాను తయారు చేసేందుకు ఏర్పాటుచేసిన సమావేశంలో వసుంధరరాజే ఉన్నారు. జాబితా ప్రకటించిన తర్వాత వసుంధర రాజే అనుచరులు ఇప్పటికీ నిరసన తెలియజేస్తూనే ఉన్నారు.

పోటీచేసే అభ్యర్థుల జాబితాను ప్రకటించిన తరువాత ఎక్కువగా అలజడి చెలరేగుతోంది. నష్టాన్ని తగ్గించేందుకు ఒక బృందాన్ని ఏర్పాటుచేసామని కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ఈ బృందం నాయకుడిగా కైలాష్ చౌదరిని నియమించారని తెలిపారు. తానుకూడా ఎనిమిది నుంచి పదిమందితో మాట్లాడినట్లుగా మేఘ్‌వాల్ వెల్లడించారు. ప్రతిరోజు నాయకులతో సమీక్ష చేస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీకి తిరుగులేని నాయకుడు నరేంద్రమోదీ. బీజేపీ సర్కార్‌పట్ల గణనీయ వ్యతిరేకత ఉంది. కొవిడ్-19 మహమ్మారి సందర్భంగా లాక్‌డౌన్ ప్రకటించడం, రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలసకార్మికులు తిరిగిరావడానికి అనేక కష్టాలుపడడం, తిరిగి కాలినడకన వచ్చేటప్పుడు కొంతమంది కార్మికులు మరణించారు. కనీసం ఆహారం, మంచినీళ్లు కూడా దారివెంట లభించలేదు. అయినప్పటికీ, మోదీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలేదు. చిన్నపిల్లలు, మహిళలతో సహా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేశంలో ఏనాడూ లేనంతగా నిరుద్యోగం నెలకొని ఉంది. రాష్ట్రం నుండి ఎక్కువ ఎంపీ సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో మోదీ అనేకసార్లు పర్యటించి దుందుడుకుగా ప్రచారం సాగిస్తున్నారు. అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. కొత్తకొత్త పథకాలు కూడా ప్రకటిస్తున్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించనున్న సందర్భంగా చాలా కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అనేక విషయాలలో కష్టాలు ఎదుర్కొంటున్న ప్రజలను ఆకర్షించి గెలుపు సాధించడం కష్టమేనని భావిస్తున్నారు. అనేక వాగ్దానాలను చేస్తున్నప్పటికీ వాటిని ప్రజలు విశ్వసించడంలేదు.

అసెంబ్లీ ఎన్నికలకు, లోకసభ ఎన్నికలకు ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' ను బీజేపీ ఎదుర్కోవలసి ఉంటుంది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, సచిన్ పైలెట్ల మధ్య కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదిరింది. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలను పొందుతున్న ప్రజలు కాంగ్రెస్ ఎలాంటి ప్రయోజనాలను కల్పించడంలేదని బీజేపీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడంలేదు. ఒకవైపు ప్రయోజనాలను పొందుతుండగా, ప్రభుత్వం ఏమీ చేయడంలేదని చెబుతున్న బీజేపీని నమ్మడం కష్టమేనని భావిస్తున్నారు. తిరిగి అధికారంలోకి వస్తే కులగణనను నిర్వహిస్తామని గెహ్లాట్ ప్రభుత్వం చేసిన ప్రకటనను ప్రజలు ఆహ్వానిస్తున్నారు. ఈ తరుణంలో బీజేపీ ఒబీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలని, ముందుముందు రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతోంది. అయితే కాంగ్రెస్ చాలా ప్రయోజనాలను కల్పించినందున ఆ పార్టీ చేసిన హామీనే నమ్ముతున్నారు. కాంగ్రెస్‌లోనూ అంతర్గత తగాదాలు ఉన్నప్పటికీ, అవి తీవ్రంగా బైటకు రావడంలేదు.

అయితే ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రంస్థాయిలో ప్రచారం సాగిస్తున్నారు. ఎన్నికలబరిలో ఆప్, ఎస్‌పీ, ఆర్‌ఎల్‌డీ, బిఎస్‌పీ పార్టీలు కూడా పోటీచేయనున్నాయి. అయితే మతపరమైన ఉద్రిక్తతలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొవలసి ఉంటుందని మత సమీకరణల ఆధారంగా ఎన్నికలు జరుగుతాయని విశ్వసిస్తున్నారు. హిందు, ముస్లింల ఓట్ల సమీకరణ ఉంటుంది.కాంగ్రెస్ పార్టీలో ఉన్న విభేదాలను తమకు అనుకూలంగా మలచుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

పలస్తీనాలో యూదులు

పలస్తీనాలో అరబ్బుల-యూదుల అంశంపై, జర్మనీలో యూదుల ఊచకోతపై నా అభిప్రాయం తెలియజేయాలని నాకు చాలా ఉత్తరాలు వచ్చాయి. ఈ క్లిష్టమైన అంశంపై కొంత జంకుతోనే నా అభిప్రాయాలు తెలియజేయడానికి సాహసిస్తున్నాను. యూదుల మీద నాకు సానుభూతి ఉంది. దక్షిణాఫ్రికాలో ఉండగా వారిని సన్నిహితంగా చూశాను. వారిలో కొందరు నాకు జీవితకాల సహచరులై పోయారు. ఇలాంటి మిత్రుల ద్వారానే దీర్ఘకాలంగా యూదులు అనుభవించిన వేధింపులు, క్షోభ గురించి నాకు తెలిసింది. వారిని క్రైస్తవులు అంటరానివారిగా చూసేవారు. క్రైస్తవులు యూదులను అంటరానివారిగా చూడడానికి అంటరానివారిని హిందువులు చూడడానికి దగ్గరి పోలిక ఉంది. వారితో అమానుషంగా ప్రవర్తించడం కోసం ఈ రెండు మతాల్లోనూ మతసమ్మతి ఉన్నట్టు చిత్రీకరించారు. కొందరు యూదులు నాకు మిత్రులైనందువల్లే కాకుండా వారి విషయంలో నాకు సానుభూతిఉండడానికి విశ్వజనీనమైన ఉమ్మడి కారణం ఒకటి ఉంది. అయితే నాకు సానుభూతి ఉన్నంత మాత్రాన న్యాయం ఏదో తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకుపోలేదు. తమకు ఒక దేశం ఉండాలన్న యూదుల కోరిక నన్ను అంతగా ఆకట్టుకోలేదు. దీనికోసం బైబిల్ నుంచి సాక్ష్యాధారాలు వెతుకుతారు. పలస్తీనాకు వచ్చిన తరవాత వారిలో తమకు ఓ దేశం కావాలన్న మంకుతనం బాగా పెరిగింది. ఈ భూగోళం మీద ఉండే ఇతరుల్లాగా వారు తాము జన్మించిన, ఉపాధి చూసుకున్న, జీవనోపాధిని చూసుకున్న చోటనే తమ దేశంగా ఎందుకు భావించరు? ఇదే అర్థంలో పలస్తీనా అరబ్బులదే. అంటే ఇంగ్లాండు ఇంగ్లీషు వారిదైనట్టుగా. ఫ్రాన్స్ ఫ్రెంచివారిది అయినట్టుగా. అరబ్బులమీద యూదులను రుద్దడం తప్పే కాదు అమానుషం కూడా.

ఏ నీతి సూత్రం ఆధారంగా చూసినా పలస్తీనాలో ప్రస్తుతం జరుగు తున్న దాన్ని సమర్థించలేం. దీనికోసం ఇచ్చే ఆదేశాలకు యుద్ధాన్ని మించిన ధర్మబద్ధత ఏమీలేదు. అరబ్బుల గౌరవాన్ని తగ్గిస్తే పలస్తీనాను యూదులకు పాక్షికంగానో, సంపూర్ణంగానో అప్పగించేయవచ్చు అనుకోవడం మానవాళి మీద కొనసాగించే నేరమే. దీనిబదులు యూదులు ఎక్కడ పుట్టి పెరిగినా వారిని న్యాయంగా పరిగణించడం మహత్తరమైన మార్గం అవుతుంది. ఫ్రాన్స్‌లో పుట్టిన యూదులు సైతం ఫ్రాన్స్‌లో పుట్టిన వారు ఫ్రెంచి వారైనంతగా అక్కడ పుట్టిన యూదులు కూడా ఫ్రెంచివారే. యూదులకు ఒక దేశం లేకపోతే, పలస్తీనానే తమ దేశం అని పట్టుబడితే తాము ఏ దేశాలలో అయితే స్థిరపడ్డారో అక్కడినుంచి తరిమేస్తే సహిస్తారా? లేదా వారు ఎక్కడబడితే అక్కడ ఉండడానికి రెండు దేశాలు కావాలా? తమకు ఒక దేశం కావాలన్న ఆరాటం జర్మనీ నుంచి యూదులను తరిమి వేయడాన్ని సమర్థించడానికే ఉపయోగపడుతుంది. అయితే జర్మనీలో యూదులను వేధించిన తీరుకు సాటి అయింది చరిత్రలో మరో ఉదంతమేలేదు. హిట్లర్ వెర్రిగా ప్రవర్తించినట్టు ఏ నియంతా ప్రవర్తించ లేదు. హిట్లర్ చాలా కసిగా యూదులను వేధిస్తున్నాడు. అంటే ఆయన ఇతరులను, సమరశీలమైన జాతీయతావాదాన్ని సమర్థించడానికి నూతనో త్సాహంతో ఈపని చేస్తున్నాడు. కొత్త మతోన్మాదాన్ని ప్రవేశపెడ్తున్నారు. ఇలాంటి స్థితిలో ఎంతటి అమానుషమైనా మానవతావాదంగా చెలామణి అయిపోతుంది. దీనికి ప్రస్తుతం భవిష్యత్తులో కూడా గౌరవం ఉంటుంది. పూర్తిగా పిచ్చెత్తినట్టు, అత్యంత నిర్భయంగా ప్రవర్తించే యువత ఆ మొత్తం జాతిని నమ్మలేనంతటి క్రౌర్యంతో ఆవరిస్తోంది. మానవత్వంపేరుతో ఇంతకన్నా సమర్థనీయమైన యుద్ధం ఏదైనా ఉంటే ఒక జాతినంతటినీ



వేధించుకు తినడాన్ని నిరోధించడానికి జర్మనీపై యుద్ధం కన్నా సమర్థనీయమైంది ఏమీలేదు. కానీ నాకు ఏ రకమైన యుద్ధంలోనూ నమ్మకంలేదు. అందువల్ల అలాంటి యుద్ధం మంచి చెడ్డలు చర్చించడం నా ఊహలోనూ, పరిధిలోనూ లేదు.

యూదులను వేపుకు తిన్నందుకు జర్మనీపై యుద్ధం లేకపోయినా జర్మనీతో సంబంధం మాత్రం కుదరదు. న్యాయంకోసం, ప్రజాస్వామ్యం కోసం నిలబడుతున్నామని చెప్తున్న ఒక జాతి ఈ రెండింటికీ బద్ధ శత్రువు అయితే దానితో మైత్రి ఎలా కుదురుతుంది? లేక ఇంగ్లాండ్ సకల విషయాల్లోనూ ఇంగ్లాండ్ సాయుధ నియతృత్వంవేపు మొగ్గుతోందా? ఎలాంటి కపటమూ, బలహీనతలేకుండా మానవత్వం ముసుగులో సమర్థంగా హింసకు పాల్పడవచ్చో జర్మనీ నిరూపిస్తోంది. తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శిస్తూ ఎంత వికృతంగా, దుర్భరంగా ప్రవర్తించవచ్చునో జర్మనీ రుజువు చేస్తోంది. ఇలాంటి వ్యవస్థీకృత, నిస్సిగ్గుతో కూడిన వేధింపును యూదులు ప్రతిఘటించగలరా? వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కునే మార్గం ఏమైనా ఉందా? నిస్సహాయంగా, నిర్లక్ష్యంగా, ఒంటరితనం అనుభవించకుండా ఉండడం సాధ్యమా? నాకు సాధ్యమేననిపిస్తోంది. భగవంతుడి అస్తిత్వాన్నినమ్మే ఏ వ్యక్తి అయినా ఒంటరిగా, నిస్సహాయంగా మిగిలిపోనక్కర్లేదు. యూదుల యెహోవా క్రైస్తవుల దేవుడికన్నా, ముస్లింల, లేదా హిందువుల దేవుడికనా భిన్నమైన వాడుకాదు. ఆ దేవుడు అందరికీ సమానమే. అద్వితీయుడే. వర్ణించనలవి కాని వాడే. కానీ యూదులు దేవుడికి ఒక వ్యక్తిత్వం అంటగడ్తారు. ఆయనే తమ ప్రతి చర్యనూ సమర్థిస్తా డనుకుంటారు. అందువల్ల వారు నిస్సహాయులుగా ఉండి పోనక్కర్లేదు. నేను జర్మనీలో పుట్టిన, అక్కడే నా జీవనోపాధి చూసుకున్నవాడిని అయి ఉంటే జర్మనీ ఎంత శక్తిమంతమైంది అయినప్పటికీ జర్మనీయే నా దేశం అని గట్టిగా నినదించేవాడిని. సవాలుచేసేవాడిని. లేక నన్ను కాల్చేయమని లేదా చీకటి కూపంలో పడవేయమని కోరేవాడిని. కానీ బహిష్కరణను, వివక్షాపూరిత వ్యవహారాన్ని ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేవాడిని కాదు. ఆ పని చేయడానికి తోటి యూదులకోసం ఎదురు చూడనక్కర్లేదు. చివరకు అందరూ నా దారికే వస్తారు అన్న విశ్వాసం ప్రదర్శించేవాడిని. పలస్తీనాలో యూదుల గురించి ఒక్క మాట. వారు తప్పుడు దారిలో ప్రయాణిస్తున్నా రనడానికి నాకు ఏ మాత్రం సందేహంలేదు. బైబిల్ భావన ప్రకారం పలస్తీనా అనేది భౌగోళికమైంది కాదు. అది వారి మనసుల్లోఉంది. కానీ భౌగోళికంగా పలస్తీనా తమదేశం అని యూదులు అనుకునేట్టయితే బ్రిటిష్ వారి తుపాకీనీడన ఆ పని చేయనక్కర్లేదు. మతపరమైన చర్యను తుపాకులు లేదా బాంబుసహాయంతో చేయకూడదు. అరబ్బుల మన:పూర్వక సమ్మతితోనేవారు ఆ పనిచేయాలి. వారు అరబ్బులహృదయాలను మార్చాలి.

అరబ్బుల హృదయాలపై రాజ్యమేలే దేవుడే యూదుల హృదయాల పైనా రాజ్యమేలుతాడు. తమ మతపరమైన ఆంకాంక్షల ఆధారంగా వారు ప్రపంచం అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చాలనుకుంటారు. అరబ్బులకు నచ్చచెప్పడానికి వందలాది మార్గాలున్నాయి. అయితే దీనికి వారు బ్రిటిష్‌వారి తుపాకీ నీడను విడనాడాలి. ఇప్పటికే ఏ పొరపాటు చేయని ప్రజలను బ్రిటిష్ వారితో కలిసి అరబ్బులను విపరీతంగా లూటీ చేశారు. అరబ్బుల అకృత్యాలను నేను సమర్థించడంలేదు. వారు తాము నమ్మినదానికోసం ప్రతిఘటించాలనుకుంటే అహింసామార్గాన్ని అనుసరించ వలసింది. తమదేశాన్ని నిష్కారణంగా ఆక్రమించుకున్నారు అనుకున్నట్ట యితే అహింసా మార్గాన్ని ఎంచుకోవలసింది. అయితే తప్పొప్పులు అన్న సర్వజనామోదయోగ్యమైన భావనలకు అనుగుణంగా అనేక దురాగతాలను ఎదుర్కొన్న అరబ్బుల ప్రతిఘటనకు వ్యతిరేకంగా మాట్లాడలేం. తాము దేవుడు నియమించిన వాళ్లం అని చెప్పుకునే యూదులు అహింసామార్గాన్ని అనుసరించి ప్రపంచంలో తమస్థానం ఏమిటో నిరూపించుకోవాలి. దేవుడు తమను నియమించాడు అన్న అంశాన్ని రుజువు చేసుకోవాలి. పలస్తీనా సహా అన్ని దేశాలూ యూదులకు తమ దేశాలే. అయితే అది దురాక్రమణ ద్వారా కాకుండా, ప్రేమాభిమానాలు, సేవాభావంవల్ల సాధించింది అయి ఉండాలి. ఒక మిత్రుడు నాకు సిసిల్ రోత్ రాసిన మానవ నాగరికతకు యూదులు చేసిన దోహదం మీద ఒక గ్రంథం పంపించారు. ప్రపంచ సాహిత్యాన్ని, కళలను, సంగీతాన్ని, నాటకాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని, వైద్యాన్ని, వ్యవసాయాన్ని సుసంపన్నం చేయడానికి యూదులు ఏం చేశారో ఆ గ్రంథంలో ఉంది. వారికి సంకల్పబలమే ఉంటే పశ్చిమ దేశాలు తమను వెలివేయడాన్ని అంగీకరించకూడదు. లేదా తమను అసహ్యించుకోవడాన్ని, మద్దతివ్వడాన్ని కూడా అంగీకరించకూడదు. దేవుడు నియమించినవారే అయితే ప్రపంచం గుర్తింపు పొందడానికి ఎవరి ముందూ లొంగి ఉండవలసిన అవసరంలేదు. అహింసాయుతమార్గం ద్వారా తాము ఇంతకు ముందు చేసిన దానికన్నా మానవాళికి ఎక్కువచేసి చూపించవచ్చు.

(పలస్తీనా నడిగడ్డపై యూదులకు దేశం ఏర్పాటుచేయడానికి పదమూడేళ్లముందే 1935లో గాంధీజీ రాసిన వ్యాసం.)

శతాబ్దాల క్రితమే రాజ్యం, మతం వేరన్న విలియమ్స్


సంగిరెడ్డి హనుమంతరెడ్డి

రాజ్యం నుండి మతాన్ని వేరు చేయాలని 400 ఏళ్ల క్రితమే ప్రతిపాదించిన మతాచారి రోజర్ విలియమ్స్ అనేక అంశాలను ప్రతిపాదించి ప్రచారం సాగించారు. 1627లో డిగ్రీ పొందిన తర్వాత మేథావి జాన్‌మిల్టన్‌కు డచ్ స్థానిక అమెరికన్ బాషలను విలియమ్స్ నేర్పి మిల్టన్ నుండి హిబ్రూ, గ్రీకు భాషలను నేర్చుకున్నారు. రోజర్ విలియమ్స్ ఇంగ్లండ్ రాజధాని లండన్‌లో జన్మించారు. ఆయన జన్మ నమోదు పత్రాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. రోజర్ 1603లో జన్మించారని చరిత్రకారులు నిర్ధారించారు. ఆయన తల్లి ఆలిస్ పెంబర్టన్. తండ్రి జేమ్స్ విలియమ్స్ మర్చంట్ టేలర్ కంపెనీలో పనిచేశారు. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ప్యూరిటన్‌గా మారడంతో చర్చిలో పదవులు పొందలేక పోయారు. రోజర్ ప్రొటెస్టాంట్, ప్యూరిటన్, వేదాంతి, రచయిత. 16, 17 శతాబ్దాల్లో రోమన్ క్యాథలిక్ చర్చి సంస్కరణలకోసం చర్చికి నిరసన తెలిపినవారిని ప్రొటెస్టాంట్లని, ప్యూరిటన్లని అనేవారు. ప్రసిద్ధ ప్యూరిటన్ ప్రబోధకుడు, రచయిత రిచర్డ్ బెర్నార్డ్ కూతురు మేరి బెర్నార్డ్‌ను 1629లో పెళ్ళి చేసుకున్నారు. వారికి ఆరుగురు సంతానం.

కొలంబస్ నాయకత్వంలో ఇటాలియన్ నావికులు బహామాస్‌లో దిగి దాని భౌగోళిక స్వరూపాన్ని చూసి ఇండియాకు వచ్చామని ప్రకటించారు. అమెరిగొ వెస్పూచి అనే మరొక ఇటాలియన్ నావికుడు ముందుకెళ్ళి అమెరికాను కనుగొన్నాడు. దానికి ఆయన పేరే పెట్టారు. ఐరోపా ప్యూరిటన్ నాయకులు అమెరికా వలసకు సిద్ధమయ్యారు. రోజర్ వలసకు ఇష్టపడలేదు. ఇంగ్లండ్ చర్చి తప్పుడు విధానాలతో అవినీతిమయంగా మారింది. ఆర్చిబిషప్ విలియం లాడ్ పాలనలో రోజర్ ఇమడలేకపోయారు. 1630 డిసెంబర్ 1 న బయలుదేరి అమెరికా ఈశాన్య ప్రాంతానికి వలసవెళ్ళారు. బోస్టన్ చర్చిమతాధికారి జాన్ విల్సన్ స్థానంలో రోజర్‌కు మతాధికారి పదవిని ఇవ్వజూపారు. రోజర్ ఈ పదవిని తిరస్కరించారు. మత స్వేచ్ఛను, స్థానిక అమెరికన్ల న్యాయ వ్యవహారాలను సమర్థించారు. నైతికత, పూజావిధానాల క్రైస్తవ సూత్రాల ఆధారంగా ప్రజలను న్యాయమూర్తులు శిక్షించరాదని, వారికి మత స్వేచ్ఛ ఉండాలని వాదించారు. విగ్రహారాధన, వారాంతపు పూజ, తప్పుడు పూజాపద్ధతులపై విస్తృతంగా బోధించారు. అనేక రచనలు చేశారు. రాజ్యం, మతం వేరుగా ఉండాలని పోరాడారు. ఈ భావాలను ప్యూరిటన్ నాయకులే వ్యతిరేకించారు. (సంస్కరణవాదులైనా మతవాదులే).

ప్రజలు అవినీతి ఇంగ్లండ్ చర్చి నుండి బయటకు రావాలని, దైవారాధనకు ప్రత్యేక చర్చిని స్థాపించాలని రోజర్ కోరారు. అదే ఆశయాలుగల సేలం చర్చి ఆయనను ఆహ్వానించి ప్రచార బాధ్యతలు అప్పజెప్పింది. తర్వాత రోజర్ మరొక బ్రిటిష్ వలస ప్రాంతం ప్లైమూత్‌కు వెళ్ళారు. ప్లైమూత్ గవర్నర్ విలియం బ్రాడ్

ప్రజలు అవినీతి ఇంగ్లండ్ చర్చి నుండి బయటకు రావాలని, దైవారాధనకు ప్రత్యేక చర్చిని స్థాపించాలని రోజర్ కోరారు. అదే ఆశయాలుగల సేలం చర్చి ఆయనను ఆహ్వానించి ప్రచార బాధ్యతలు అప్పజెప్పింది. తర్వాత రోజర్ మరొక బ్రిటిష్ వలస ప్రాంతం ప్లైమూత్ కు వెళ్ళారు. ప్లైమూత్ గవర్నర్ విలియం బ్రాడ్ ఫోర్డ్ ఆయన బోధనలను ఆమోదించారు. స్థానిక అమెరికన్ల భూములను ఐరోపా వలసదార్లు కొనడంపై ఉన్న నిషేధాన్ని ప్రశ్నించారు. రోజర్ బోధనలను మెచ్చుకున్న ప్లైమూత్ గవర్నర్ విలియం బ్రాడ్‌ఫోర్డ్ ఈ నిరసనను విమర్శించారు. భూమిని కనుగొన్న మొదటి చక్రవర్తిని నేనేనన్న రాజు జేమ్స్ వాదనను రోజర్ ఖండించారు.

ఫోర్డ్ ఆయన బోధనలను ఆమోదించారు. స్థానిక అమెరికన్ల భూములను ఐరోపా వలసదార్లు కొనడంపై ఉన్న నిషేధాన్ని ప్రశ్నించారు. రోజర్ బోధనలను మెచ్చుకున్న ప్లైమూత్ గవర్నర్ విలియం బ్రాడ్‌ఫోర్డ్ ఈ నిరసనను విమర్శించారు. భూమిని కనుగొన్న మొదటి చక్రవర్తిని నేనేనన్న రాజు జేమ్స్ వాదనను రోజర్ ఖండించారు. 1633లో పాస్టర్ శామ్యూల్ స్కెల్టన్ సేలం చర్చికి రోజర్‌ను పూజారిగా నియమించారు. రాజు-మత కలయికను ప్రశ్నించిన నేరానికి బోస్టన్ న్యాయస్థానం రోజర్‌ను పూజారి పదవి నుండి తొలగించింది. విభిన్న, కొత్త అపాయకర అభిప్రాయాలను రోజర్ ప్రచారం చేస్తున్నారని సార్వజనిక న్యాయస్థానం 1635 అక్టోబర్‌లో ప్రకటించింది. రాజద్రోహం, మతవిరోధం అభియోగాలపై రోజర్‌ను బ్రిటిష్ వలసప్రాంతం మసాచుసెట్స్ బే కాలని నుండి బహిష్కరించింది.

1636లో అట్లాంటిక్ మహాసముద్ర సరిహద్దులో, అమెరికా తూర్పుతీర ప్రాంతంలో రోజర్ 'ప్రావిడెన్స్ ప్లాంటేషన్స్' ను స్థాపించారు. నైతికభావాల స్వేచ్ఛ పేరుతో శరణార్థుల, అల్పసంఖ్యాక మతస్థుల శిబిరంగా దీన్ని తీర్చిదిద్దారు. ఈ వలస ప్రదేశం తర్వాత రోడ్ ద్వీప వలసప్రాంతంగా, రోడ్ ద్వీప రాష్ట్రంగా మారింది. రోజర్ విలియమ్స్ తన కొత్త వలస స్థావరం నుండి ప్రజల మత స్వేచ్ఛకోసం, రాజ్యం, మతం కలవరాదని, వేరువేరుగా ఉండాలని, పాలనలో మత జోక్యం నిషేధమని, ప్రజలకు అధిక సంఖ్యాక ప్రజాస్వామ్య సూత్రాలు అమలు కావాలని ప్రచారం చేశారు. ఉద్యమాలు చేపట్టారు. రోజర్ అనుచరులు కొందరు ఆయన నుండి విడిపోయారు. 1638లో రోజర్, ఆయన 12 మంది అనుచరులు ప్రావిడెన్స్‌లో కొత్త మత విశ్వాసాల సంస్థను స్థాపించారు. అది అమెరికాలో మొదటి బాప్టిస్టు చర్చిగా గుర్తింపుపొందింది. రోజర్ స్థానిక అమెరికన్ జాతులు, వలసదారుల మధ్య సఖ్యత కూర్చారు. 40 ఏళ్ల పాటు మధ్యవర్తిత్వం, చర్చలు, సంప్రదింపుల ద్వారా ఆ ఐక్యతను కాపాడారు, స్థిరపరిచారు. రోజర్ 'అమెరికా భాషల ప్రాధాన్యత' అన్న పుస్తకం రాశారు. అందులో స్థానిక ఈశాన్య అమెరికా జాతుల జీవితాలు, సంస్కృతులు, జనన మరణాల ఆచారాలు, అవసర సంస్కరణలను వివరించారు. స్థానికజాతులపై వలసదారుల ఆధిపత్య ధోరణులకు స్వస్తిపలికారు. మనందరికి దేవుడుఇచ్చిన రక్తం ఒకటేనని ప్రచారం చేశారు. ఇవి ఈశాన్యఅమెరికా జాతుల ఐక్యతకు తోడ్పడ్డాయి. ప్రభుత్వ బాధ్యతారహిత, ప్రజావ్యతిరేక విధానాలతో మరొక పుస్తకం రాశారు. రోజర్ బానిసత్వాన్ని నిరసించారు. యుద్ధంలో ఓడినవారిని బానిసలుగా మార్చడం నాటి ఆనవాయితి. దీన్నిఆయన వ్యతిరేకించకపోవడం ఆశ్చర్యం. అయితే యుద్ధంలో స్త్రీలు, పిల్లలను బంధించ రాదని, వారితో బానిసత్వ పనులు చేయించరాదని గవర్నర్‌కు ఉత్తరాలు రాశారు. 1637 జులై యుద్ధంలో పట్టుబడ్డ ఒక పిల్లవాన్ని వ్యక్తిగత సేవకునిగా స్వీకరించారు. ఆయన స్థాపించిన ప్రావిడెన్స్ ప్లాంటేషన్స్ 1652లో ఆమోదించిన చట్టంలో బానిసత్వాన్ని రద్దుచేయలేదు. బానిస కాలపరిమితిని తగ్గించారు. స్థానికులు బానిసలను సేవకులుగా నియమించు కోవచ్చన్నారు. ఇవి ఆయన సనాతన మతాచార సంకేతాలు. దైవ సర్వాధికారాన్ని, ప్రజల పాపాలను దేవుడు ప్రేమ, దయలతో పరిష్కరిస్తాడన్న మత సిద్ధాంతాలను రోజర్ తిరస్కరించారు. మతం నుండి రాజ్యాన్ని వేరుచేయాలన్న ఆయన తాత్విక న్యాయశాస్త్ర భావన మత సంస్థలనుండి పాలన వ్యవస్థను దూరంచేస్తుంది. లౌకిక భావాలకు, పాలనకు దారితీస్తుంది. మతరాజ్య వేర్పాటుకు రోజర్ తీవ్రంగా కృషిచేశారు. పాలన పౌరజ్ఞానంతో ఉండాలి. మతాచారాలతో, దైవభావాలతో నిండరాదని ప్రచారం చేశారు. "వ్యక్తుల ప్రవర్తనలను దైవ నైతిక పూజాసూత్రాలు నియంత్రించరాదు. రాజ్యం హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం, అబద్ధాలు, తల్లిదండ్రుల నిరాదరణలను అరికట్టాలి. రాజ్యం మత విశ్వాసాలను, ఆచారాలను, పూజావిధానాలను తిరస్కరించాలి. మత విషయాలలో రాజ్య జోక్యం మతాన్ని, సమాజాన్ని అవినీతిమయం చేస్తుంది. క్రైస్తవం లేని రోజుల్లో కూడా పౌర సుపరిపాలన సాగింది. రాజ్యం పౌర క్రమశిక్షణను, న్యాయాన్ని పోషించాలి." అన్నారు. ఈనాడు ప్రపంచవ్యాపితంగా ప్రత్యేకించి భారత్‌లో రాజ్యం, మతం కలగాపులగంగా కలిసిపోయాయి. లౌకికత్వానికి తిలోదకాలిచ్చాయి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
చరవాణి: 9490204545

ఆ పల్లెలకు ఓట్ల పండుగ...

రాయ్‌పూర్ : స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత బస్తర్ ప్రాంతంలోని 120కి పైగా మారుమూల గ్రామాల నివాసితులు వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ సొంత గ్రామాల్లో ఓటు వేసే అవకాశాన్ని పొందనున్నారు. గతంలో మావోయిస్టుల స్థావరాలుగా ఉన్న ఈ ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఈ గ్రామాల ఓటర్లు 8 నుంచి 10 కిలోమీటర్లు నడిచి కొండలు, వాగులు దాటి ఓటు వేయాల్సి రావడంతో ఉత్సాహంగా ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం కష్టతరంగా మారడంతో అధికారులు ఈ అభివృద్ధిని 'బుల్లెట్‌పై బ్యాలెట్' విజయంగా అభివర్ణిస్తున్నారు. ఒకప్పుడు మావోయిస్టులకు కోటలుగా పరిగణించబడే మారుమూల గ్రామాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు బస్తర్ ప్రాంతంలో మెరుగైన భద్రతను, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడాన్ని సూచిస్తున్నాయని అధికారులు అంటున్నారు. ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 12 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. నవంబరు 7న రెండు దశల ఎన్నికలలో మొదటి దశ పోలింగ్ జరుగుతుంది. బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.సుందర్‌రాజ్ పీటీఐతో మాట్లాడుతూ. 'నవంబరు 7న ఓటింగ్ కోసం బస్తర్ ప్రాంతంలో 126 కంటే ఎక్కువ కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రాల్లో ఎక్కువ భాగం పాత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ కొత్త పోలింగ్ కేంద్రాలు బస్తర్ ప్రాంతంలోని భవిష్యత్ తరాలకు 'బుల్లెట్‌పై బ్యాలెట్' విజయాన్ని సూచిస్తాయి' అని తెలిపారు. 126 కొత్త పోలింగ్ కేంద్రాలకుగాను 15 కంకేర్ అసెంబ్లీ నియోజకవర్గంలో, 12 అంతగఢ్‌లో, 5 భానుప్రతాపూర్ (కంకేర్ జిల్లా), 20 కొంటా (సుక్మా జిల్లా), 14 చిత్రకోట్‌లో, 4 జగదల్‌పూర్‌లో, 1 బస్తర్ (బస్తర్ జిల్లా), కొండగావ్‌లో 13, కేశ్‌కల్ (కొండగావ్ జిల్లా) లో 19,

నారాయణపూర్‌లో 9, దంతెవాడలో 8, బీజాపూర్‌లో 6 కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో గత ఐదేళ్లలో 65 కంటే ఎక్కువ కొత్త భద్రతా శిబిరాలను (రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు) ఏర్పాటు చేయడం వల్ల క్షేత్ర పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చిందని, తద్వారా మారుమూల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో సహాయపడిందని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాల్లో క్లిష్ట భౌగోళిక ప్రాంతాలు, మావోయిస్టుల బెదిరింపుల కారణంగా గతంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోయామని పోలీసు అధికారులు తెలిపారు.

చందమేట గ్రామానికి చెందిన పాలో మార్కం అనే గిరిజన మహిళ గతంలో తాను ఓటు వేయడానికి చింద్‌గూర్ గ్రామానికి చేరుకోవడానికి కొండ ప్రాంతాలను దాటి సుమారు 8 కిలోమీటర్లు నడవాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు తన సొంత గ్రామంలో ఓటు వేయనుండటం సంతోషంగా ఉందని అన్నారు. జగదల్‌పూర్ నియోజకవర్గంలోని నాలుగు గ్రామాలలో చందమేటలో మొదటి సారిగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఒకప్పుడు మావోయిస్టులకు కోటగా పరిగణించబడే చందమేట, బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం అయిన జగదల్‌పూర్ నుంచి 65 కిలోమీటర్ల దూరంలో చత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో తులసి డోంగ్రీ కొండల దిగువన ఉంది. 'ఇంతకుముందు, మేము మా ఓటు వేయడానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింద్‌గూర్‌కు వెళ్లాలి. రహదారి లేదు. అందువల్ల ఎవరైనా మట్టి రోడ్ల గుండా వెళ్లాలి. రహదారిని కేవలం ఒక సంవత్సరం క్రితం నిర్మించారు. మేము పోలింగ్ కేంద్రాన్ని కలిగి ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా గ్రామాభివృద్ధికి పాటుపడే వారికే ఓటేస్తాం' అని మార్కం అన్నారు. గ్రామానికి చెందిన మరొక నివాసి శ్యామ్ కవాసి ఇదే భావాన్ని వ్యక్తం చేశాడు. పోలింగ్ బూత్ 8 కి.మీ దూరంలో ఉన్నందున, రహదారి సౌకర్యం లేనందున తమ గ్రామానికి చెందిన చాలా మంది ఓటర్లు తమ ఓటు వేయడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఈసారి గ్రామం మొత్తం ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఉందని తెలిపారు.

స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి సొంత గ్రామాల్లోనే పోలింగ్

'చందమేట గ్రామస్తులు తమ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని అభ్యర్థించారు. గత సంవత్సరం గ్రామంలో భద్రతా బలగాలు విడిది చేయడంతో జిల్లా యంత్రాంగం అక్కడ అభివృద్ధి పనుల్లో వేగంగా ముందుకు సాగింది. గ్రామం, పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని అనుసంధానించే రహదారిని నిర్మించారు. గ్రామంలో విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయి' అని బస్తర్ కలెక్టర్ విజయ్ దయారామ్ కె. తెలిపారు. 432 జనాభా ఉన్న చందమేటలోని చాలా కుటుంబాల్లో పోలీసు క్యాంపు ఏర్పాటుకు ముందు ఆ ప్రాంతంలో మావోయిస్టులతో సంబంధమున్న ఓ సభ్యుడు ఉన్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా గత ఏడాది ఆగస్టు 15న గ్రామంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇప్పుడు స్వాతంత్ర్యానంతరం గ్రామస్తులు తొలిసారిగా తమ సొంత గ్రామంలో కొత్త పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తారని తెలిపారు. గ్రామంలో 290 మంది ఓటర్లు ఉన్నారు.

వారిలో 148 పురుషులు, 142 మహిళలు. ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలోని మావోయిస్టుప్రభావిత బస్తర్ డివిజన్‌లోని 12 నియోజకవర్గాలు... మోహ్లా, మన్‌పూర్, అంబగఢ్ చౌకీ, రాజ్‌నంద్‌గావ్, ఖైరగఢ్, చుయిఖదాన్, గండై, కబీర్‌ధామ్ జిల్లాల్లోని ఎనిమిది నియోజకవర్గాలకు తొలి దశలో పోలింగ్ జరగనుంది. మిగిలిన 70 నియోజకవర్గాలకు నవంబరు 17న రెండో దశలో పోలింగ్ జరుగుతుంది. డిసెంబరు 2న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

జైలుకు ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం ఆరోపణలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టు అయిన ఆప్ నాయకుడు సంజయ్‌సింగ్‌ను అక్టోబరు 27వ తేదీ వరకు ఢిల్లీ కోర్టు జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. ఈడీ కస్టడీ పూర్తికావడంతో పూర్తికావడంతో సంజయ్‌సింగ్‌ను పోలీసులు శు క్రవారం కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో సంజయ్‌సింగ్‌ను ప్రత్యేక జడ్జి ఎంకే నాగపాల్ జైలుకు పంపారు. విచారణ సందర్భంగా అనవసరమైన అంశాలపై కోర్టు లోపల మాట్లాడవద్దని సంజయ్‌సింగ్‌ను జడ్జి ఆదేశించారు. అదానీకి వ్యతిరేకంగా తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఈడీ దర్యాప్తు చేయలేదని సంజయ్‌సింగ్ వాదించడంపై జడ్జి నాగపాల్ ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతం అదానీ అక్రమాలపై ఆప్ చాలాకాలంగా ఆరోపణలు చేస్తోంది. అందులో భాగంగా సంజయ్‌సింగ్ ఈరోజు ప్రత్యేకకోర్టులో అదానీ వ్యవహారాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన జడ్జి 'ఈ కేసుకు, నీవు ప్రస్తావించే అంశానికి సంబంధం లేదు. అదానీ, మోదీ గురించి నీవేమైనా మాట్లాడాలనుకుంటే...వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేను అడుగుతాను. అప్పుడు అన్ని విషయాలు వివరించవచ్చు' అని చెప్పారు. ఈడీ తన కస్టడీ సమయంలో అవసరమైన ప్రశ్నలు అడగలేదని సంజయ్‌సింగ్ ఆరోపించారు. 'అమ్మ దగ్గర నుంచి డబ్బు ఎందుకు తీసుకున్నావు. మీ భార్య ఖాతాలోకి రూ.10 వేలు ఎందుకు పంపావు. ఈడీ ఓ వినోద్మాకశాఖగా మారింది. అబద్ధాలు మీద అబద్ధాలు చెబుతోంది. అదానీకి వ్యతిరేకంగా నేను ఫిర్యాదు చేశాను. అయితే ఈడీ పట్టించుకోలేదు' అని రాజ్యసభ ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ వివరించారు. సంజయ్‌సింగ్‌ను అక్టోబరు 4న ఈడీ అరెస్టు చేసిన విషయం విదితమే.

మహిళల భద్రతకు ముప్పు: పవార్

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వంపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ శుక్రవారం విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిధానంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని నిందించారు. శరద్ పవార్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మే 31 వరకు రాష్ట్రంలో 19,553 మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పారు. మహిళల అదృశ్యంపై ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నాయకత్వంలో నడుస్తున్న హోంశాఖ లక్ష్యంగా పవార్ విమర్శలు చేయడం వారం రోజుల్లో ఇది రెండోసారి. ముంబై పోలీసుశాఖలో సిబ్బందిని కాంట్రాక్టు విధానంలో తీసుకోవడంపైనా పవార్ మండిపడ్డారు. కాంట్రాక్టు పద్ధతిపై పోలీసుల నియామకం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పవార్ గురువారం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ పోలీసు శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలను నిశితంగా విమర్శించారు. ఇందులోనూ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ముంబై పోలీసుల కింద పనిచేయడానికి తమ సొంత భద్రతా సంస్థ నుంచి మూడు వేలమంది సిబ్బంది నియామకానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావిధానంపైనా పవార్ విమర్శలు చేశారు. సంఖ్య తక్కువ సాకుతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడం, కొన్ని పాఠశాలల విలీనం వంటి అంశాలు విద్యావ్యవస్థకు తీరని నష్టం చేస్తాయని పవార్ హెచ్చరించారు.

మణిపురి విద్యార్థుల అదృశ్యం సూత్రధారి అరెస్టు

న్యూఢిల్లీ: ఇద్దరు మణిపురి విద్యార్థుల అదృశ్యం వెనుక గల సూత్రధారిని సీబీఐ అరెస్టు చేసింది. అతనే ఆ విద్యార్థులను చంపినట్లు అనుమానిస్తున్నారు. 22 ఏళ్ల పావోలున్మాంగ్‌ను సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం బుధవారం పూనెలో అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కోర్టులో హాజరు పరిచేందుకు నిందితుడిని గువహతికి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ప్రత్యేక కోర్టు నిందితుడిని అక్టోబరు 16వ తేదీ వరకు సీబీఐ కస్టడీకి ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసులో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలను కేంద్ర దర్యాప్తు సంస్థ అక్టోబరు ఒకటవ తేదీన అరెస్టు చేసింది. మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో ఇద్దరు బాలికలు జులై 6వ తేదీన అదృశ్యమైన విషయం విదితమే. ఈ కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది.

ఈవీఎంలతో ఎన్నికల్లో పారదర్శకత పెరిగింది

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) దేశ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచిందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 100 కోట్ల మంది భారతీయులు ఓటు వేయడానికి అర్హులని తెలిపారు. ఇక్కడ తొమ్మిదవ జీ20 పార్లమెంటరీ స్పీకర్‌ల సదస్సు (పీ20) ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తూ, 'ప్రజాస్వామ్య పండుగ' (2024 వేసవిలో జరగనున్న తదుపరి లోక్‌సభ ఎన్నికలు) చూసేందుకు వచ్చే ఏడాది మళ్లీ భారతదేశాన్ని సందర్శించాల్సిందిగా ఆయన ప్రతినిధులను ఆహ్వానించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓటింగ్ శాతం దేశ పార్లమెంటరీ విధానాలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందన్నారు. 91 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో 67 శాతం మంది గత పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ ఆధునీకరించబడిందని, ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) గత 25 ఏళ్లుగా వాడుకలో ఉందన్నారు. ఈవీఎం ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమర్థతను తీసుకొచ్చిందని, కౌంటింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ఎన్నికల ఫలితాలు తెలుస్తాయని తెలిపారు. అయితే ఈవీఎంల విశ్వసనీయతపై కాంగ్రెస్ వంటి అనేక ప్రతిపక్ష పార్టీలు సందేహం వ్యక్తం చేశాయి. బీఎస్పీ వంటి కొన్ని పార్టీలు బ్యాలెట్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల కమిషన్ ఈవీఎంలను సమర్థించింది. న్యాయపరమైన ప్రకటనలు తనకు అనుకూలంగా ఉన్నాయని, బ్యాలెట్ వ్యవస్థకు తిరిగి వెళ్లేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. గత లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ బీజేపీని వరుసగా రెండోసారి గెలిపించారని గుర్తుచేస్తూ, మొత్తం యూరప్‌లోని జనాభా కంటే ఎక్కువ నమోదయిన ఓటర్ల సంఖ్యతో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల కసరత్తు అని మోదీ అన్నారు. 2019 ఎన్నికల్లో మహిళలు రికార్డు స్థాయిలో భాగస్వామ్యమయ్యారని ఆయన ప్రతినిధులకు వివరించారు. రాజకీయ భాగస్వామ్య విస్తరణను ప్రస్తావిస్తూ, గత సార్వత్రిక ఎన్నికల్లో 600కు పైగా రాజకీయ పార్టీలు పాల్గొన్నాయని, కోటి మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిర్వహణకు కృషి చేశారని, ఇందుకోసం 10 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రధాని చెప్పారు.

రేపు మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17న జరగనున్న కోసం కాంగ్రెస్ పార్టీ 130మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆదివారం ప్రకటించనుంది. ఐదు సర్వేల ఆధారంగా మొత్తం 230 స్థానాలకు అభ్యర్థుల పేర్లను రెండు విడతలుగా ప్రకటించాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్‌తో సన్నిహితంగా ఉండే ఒక నాయకుడు చెప్పారు. ఈ సర్వేలలో ఒకటి రాహుల్ గాంధీ తరపున ఎన్నికల వ్యూహకర్త సునీల్ కానుగోలు చేయగా... మరొకటి కమల్‌నాథ్ చూసుకున్నట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ తన తొలి జాబితా కోసం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ సహా 15 మంది మాజీ ఎమ్మెల్యేలు, దాదాపు 90 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల పేర్లను క్లియర్ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కమల్ నాథ్ బరో చింద్వారా నుంచి పోటీ చేస్తారని పేర్కొన్నాయి. హిందువులు తమ పూర్వీకులకు తర్పణాలు అర్పించే పితృ పక్షం సెప్టెంబర్ 29న ప్రారంభమై ఈ ఏడాది అక్టోబర్ 14న ముగుస్తుంది. ఆ తర్వాతనే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తుందని గతంలో కమల్‌నాథ్ చెప్పారు. '103 మంది అభ్యర్థుల పేర్లు రెండు రోజుల క్రితం నిర్ణయించబడ్డాయి. ఆమోదించబడ్డాయి కానీ కొనసాగుతున్న 'శ్రాద్' కాలం కారణంగా మేము వారి పేర్లను ప్రకటించలేదు' అని నాథ్ సన్నిహితుడు చెప్పారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో మా కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఢిల్లీలో కొనసాగుతోందని... ఇది ప్రధానంగా రెండవ జాబితా కోసం అభ్యర్థులను ఎంపిక చేయడంపై దృష్టి సారించినట్లు మరో కాంగ్రెస్ నాయకుడు వెల్లడించారు.మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీ ఇప్పటికే నాలుగు జాబితాల ద్వారా 136 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్నికల తేదీని ప్రకటించడానికి ఒకటిన్నర నెలల ముందు ఆగస్టు 17న కాషాయ పార్టీ 39 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది.

కానుకల పేరిట పేదలను పిచ్చోళ్లను చేస్తున్న బీజేపీ

త్రిపుర కాంగ్రెస్ విమర్శ



అగర్తలా: దసరాకు ముందు కానుకల పేరుతో రాష్ట్రంలోని 9.70 లక్షల మంది రేషన్ కార్డుదారులను బీజేపీ ప్రభుత్వం పిచ్చోళ్లను చేస్తోందని త్రిపుర ప్రదేశ్ కాంగ్రెస్ విమర్శించింది. ప్రత్యేక కానుక పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 10న సీఎం మాణిక్ సాహా, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి సుశాంతా చౌదరి ప్రారంభించారు. కానుక రూపేణ కాన్వాస్ సంచి, ఒక లీటరు ఆవాల నూనె, కేజి పప్పులు, పిండి, 500 గ్రాముల ఉప్మా రవ్వను అందజేశారన్నారు కానీ రేషన్ స్టోర్ల వద్ద అనేక మంది లబ్ధిదారులకు చేదు అనుభవాలు ఎదురయ్యాయని అని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశీశ్ కుమార్ సాహా వెల్లడించారు. ఆశీశ్ కుమార్ సాహా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం ఫొటోతో ఉన్న సంచి మాత్రమే ఉచితంగా ఇస్తూ సరుకులను కొనుగోలు చేయాలని పేదలకు సూచించారని అన్నారు. నూనెపై రూ.113 సబ్సిడీ మినహా మిగతా అన్నింటికి పూర్తి పైకం చెల్లించాల్సిందేనని తెలిపారు. నిత్యావసరాల ధరల దృష్ట్యా పేదలకు పండగ పూట కానుకను సీఎం ఇస్తున్నారని భావిస్తే ఇది బీజేపీ ప్రభుత్వ మరో జుమ్లా అని తేలిందని ఆయన వ్యాఖ్యానించారు. నిరుద్యోగం, అధిక ధరలతో పాటు గిరిజనుల సమస్యలపై కాంగ్రెస్ నవంబరు 22న రాజభవన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు సాహా తెలిపారు. అభియాన్ కార్యచరణను నిర్ణయించేందుకు పార్టీ నేతలతో ఆదివారం కలుస్తామని చెప్పారు.

బాంబే సీజే ప్రమాణస్వీకారంపై పిల్

తిరస్కరించిన సుప్రీం...పిటిషనర్‌కు జరిమానా

న్యూఢిల్లీ: రాజ్యాంగం ప్రకారం ప్రమాణ స్వీకారం చేయనందున బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ మళ్లీ ప్రమాణ స్వీకారం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యా (పిల్)న్ని సుప్రీంకోర్టు శు క్రవారం తిరస్కరించింది. పిటిషన్‌ను పనికిరానిదిగా పేర్కొంటూ దీనిని దాఖలు చేసిన న్యాయవాదికి కోర్టు రూ.25,000 జరిమానా విధించింది. జస్టిస్ ఉపాధ్యాయ ఈ ఏడాది జులై 29న బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు... తన పేరును చదవడానికి ముందు 'నేను' అనే పదాన్ని ఉపయోగించలేదని... ఇది రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్‌కు విరుద్ధమని న్యాయవాది పిల్ దాఖలు చేశారు. దీనిపై పిటిషన్ దాఖలు చేసిన లక్నోకు చెందిన న్యాయవాది అశోక్ పాండేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం... 'పనికిమాలిన పనికి కూడా ఓ హద్దు ఉంటుంది" అని పేర్కొంది. 'ఇది కొంత ప్రచారం పొందడానికి పిల్ అధికార పరిధిని ఉపయోగించుకునే పనికిమాలిన ప్రయత్నం మాత్రమే... ఇలాంటి పనికిమాలిన పిల్స్... ముఖ్య విషయాలను విచారించకుండా కోర్టు సమయాన్ని వృథా చేస్తాయి' అని ధర్మాసనం పేర్కొంది.

ప్రముఖ పాత్రికేయుడు సచ్చిదానందమూర్తి మృతి

బెంగళూరు: ప్రముఖ పాత్రికేయుడు కేఎస్ సచ్చిదానంద మూర్తి కన్నుమూశారు. శుక్రవారం ఇక్కడ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. 68 ఏళ్ల మూర్తి... ఇటీవల ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారని, గత కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. మూర్తి ది వీక్ మ్యాగజైన్, మలయాళ మనోరమ దినపత్రికకు ఢిల్లీ రెసిడెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. మూర్తి నవంబర్ 1982లో ది వీక్‌కి బెంగళూరు కరస్పాండెంట్‌గా చేరారు. సెప్టెంబర్ 2022లో పదవీ విరమణ చేసే వరకు మలయాళ మనోరమ గ్రూప్‌లోనే ఉన్నారని ఆ పత్రిక తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఫిబ్రవరి 1989లో బెంగుళూరులో పత్రిక ప్రత్యేక ప్రతినిధి అయ్యారు. జాతీయ రాజధాని బ్యూరో చీఫ్‌గా ఏప్రిల్ 1990లో ఢిల్లీకి మారారు. ఏప్రిల్ 2000లో ఆయన రెసిడెంట్ ఎడిటర్‌గా నియుక్తులయినట్లు 'ది వీక్' వెల్లడించింది. మూర్తి మృతిపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తన ప్రియమైన మిత్రుడు, శ్రేయోభిలాషి అని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కూడా మూర్తి మృతికి సంతాపం ప్రకటించారు. పత్రికారంగంల చేసిన సేవలకు గాను మూర్తి అనేక పురస్కారాలు, అవార్డులు అందుకున్నారు. ఆయన కుటుంబం కర్నాటకలోని కోలార్ జిల్లా అష్టగ్రామ గ్రామాలకు చెందినది.

ప్రధాని, సీఎం సభలకు అద్దె బస్సులు... ఆర్టీసీకి గుజరాత్ సర్కార్ రూ.22 కోట్ల బకాయి

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి పర్యటనల కోసం వినియోగించిన ఆర్‌టీసీ బస్సుల అద్దెను మూడేళ్లుగా గుజరాత్ ప్రభుత్వం చెల్లించలేదు. ప్రధాని, సీఎం సభలకు ప్రజలను తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టీసీ బస్సులను ఉపయోగించుకుంది. మొత్తంమీద గుజరాత్ ప్రభుత్వం రూ.22 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. మోదీ లేదా గుజరాత్ ముఖ్యమంత్రి పాల్గొనే సభలకు ప్రజలను తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఆర్‌టీసీ బస్సులు వినియోగించుకుంది. కానీ ఆ సంస్థకు చెల్లించాల్సిన రూ.22 కోట్లు ఇవ్వలేదు. విజయ్ రూపానీ, భూపేంద్ర పటేల్ ఆ సమయంలో ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఆ మూడేళ్లలో ప్రధాని, ముఖ్యమంత్రి సభల కోసం మొత్తం 34,868 బస్సులు కేటాయించామని గుజరాత్ ఆర్‌టీసీ తెలిపింది. 2020-2021లో బస్సుల అద్దెకు ప్రభుత్వం కేవలం రూ.14.27 లక్షలు, 2021-22లో రూ.8.21 కోట్లు చెల్లించింది. రూ.74.43 లక్షలు ఇంకా చెల్లించలేదు. 2022-23లో ప్రభుత్వం రూ.86 కోట్లు చెల్లించిందని, ఇంకా రూ.21.41 కోట్లు ఇవ్వాల్సి ఉందని వివరించింది. మొత్తం బకాయిలు రూ.22.16 కోట్లు ఉన్నట్లు ఆర్‌టీసీ వివరించింది. ఆ డబ్బులు తిరిగి వసూలు చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందని రవాణా శాఖ తెలిపింది.

ఈసీలకు కేబినెట్ కార్యదర్శితో సమాన హోదాపై పునఃపరిశీలన అవశ్యం: ఖురేషి

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లులో ఈసీల స్థాయిని తగ్గించి కేబినెట్ కార్యదర్శితో సమాన హోదా కల్పించే అంశంపై పునఃపరిశీలన అవసరమని మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషి అన్నారు. 'ఇండియాస్ ఎక్స్‌పెరిమెంట్ విత్ డెమొక్రసీ: ది లైఫ్ ఆఫ్ నేషన్ థ్రూ ఇట్స్ ఎలక్షన్స్' అనే కొత్త పుస్తకాన్ని రచించిన క్రమంలో పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఈసీల నియామక బిల్లు గురించి ఖురేషి మాట్లాడారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుంచి కేబినెట్ కార్యదర్శి స్థాయికి హోదా దిగజార్చడం సరైనది కాదని, దీనిని మరలా సమీక్షించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ 'విశ్వగురు'గా మారిన వేళ ఇలాంటివి తగవన్నారు. 'పదేళ్లలో 108 దేశాల కమిషన్లకు శిక్షణ ఇచ్చాం. ప్రపంచంలోని సగం దేశాల్లో న్యాయమూర్తులే ఎన్నికల కమిషనర్లుగా ఉన్నారు. ఇక్కడి బ్యూరోక్రసిని ఎదుర్కోవడం వారికి సమస్యగా మారవచ్చు' అని ఖురేషి అన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం అర్హతలను సూచించడం సహా అనేక సానుకూలతలూ ఈ బిల్లులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు ఈసీలకు విద్యార్హతలను నిర్దేశించలేదు. రోడ్డున పోయే వాడిని తెచ్చి ఎన్నికల కమిషనర్ చేసే పద్ధతి మంచిది కాదు. కొత్త బిల్లులో ఈసీలకు ఉండాల్సిన అర్హతలను పొందుపర్చారు. కార్యదర్శి ర్యాంకు అధికారులు లేక సమాన హోదా ఉన్న వారినే నియమిస్తామని బిల్లు చెబుతుండటం శుభపరిణామం. అలాగే కమిటీని సంక్షిప్తకరించడం కూడా మంచి ఆలోచన. ఇది చాలా దేశాల్లో ఉంది' అని ఆయనన్నారు. తొలగింపు నుంచి రక్షణను ముఖ్యంగా డిమాండ్ చేస్తున్నామని 2010 జులై నుంచి 2012 జూన్ వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా ఉన్న ఖురేషి అన్నారు. ఈసీల బిల్లును రాజ్యసభలో ఈ ఏడాది ఆగస్టులో ప్రవేశపెట్టడం విదితమే.

జార్ఖండ్ సీఎం సోరెన్‌కు చుక్కెదురు

ఈడీ సమన్ల నిలిపివేతకు హైకోర్టు తిరస్కృతి

రాంచీ: మనీలాండరింగ్ ఆరోపణల కేసులో తనకు ఈడీ సమన్లు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు శు క్రవారం కొట్టివేసింది. సమన్లకు హాజరవ్వాల్సిన గడువు ఇప్పటికే ముగిసిందున ఈ కేసులో ఎలాంటి మెరిట్ లేదని ప్రధాన న్యాయమూర్తి సంజయ కుమార్ మిశ్రా, జస్టిస్ ఆనందసేన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆగస్టు 14న రాంచీలోని ఈడీ కార్యాలయంలో కార్యాలయంలో కావాలని... ఆ తర్వాత తేదీల్లో మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 కింద స్టేట్‌మెంట్‌ను నమోదు చేయాల్సి ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోరెన్‌కు సమన్లు పంపింది. దర్యాప్తు సంస్థ తనకు జారీ చేసిన సమన్లు చెల్లవని సోరెన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సమన్లపై తన పిటిషన్‌ను స్వీకరించేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు... ఈ విషయంలో ఉపశమనం కోసం జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించే స్వేచ్ఛను కల్పించడంతో ముఖ్యమంత్రి హైకోర్టును ఆశ్రయించారు. అయితే మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 50, సెక్షన్ 63లను భారత రాజ్యాంగం ప్రకారం న్యాయవిరుద్ధమని, తనకు వ్యతిరేకంగా వచ్చిన సమన్లను చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ తగిన ఆదేశాలు జారీ చేయాలని సోరెన్ తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు. రాజకీయ దురుద్దేశంతోనే తనపై సమన్లు జారీ చేశారని, రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి, అశాంతి సృష్టించాలనే ఏకైక ఉద్దేశంతో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని సోరెన్ కోర్టులో పేర్కొన్నారు. బుధవారం నాటి హైకోర్టు విచారణలో సీఎం తరఫు న్యాయవాది పి చిదంబరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ కుమార్ మిశ్రా, జస్టిస్ ఆనందసేన్‌ల ధర్మాసనానికి సోరెన్‌ను సాక్షిగా పిలిచారా లేక నిందితుడిగా పిలిచారా అనేది అస్పష్టంగా ఉందని చెప్పారు.

గురువారం విచారణలో భాగమైన ఒక సీనియర్ న్యాయవాది మాట్లాడుతూ... రెండు కారణాల వల్ల ఈ పిటిషన్‌ను విచారించడం సాధ్యం కాదని గమనించిన కోర్టు పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు. 'మొదటిది... సమన్ల జీవితకాలం ముగిసిపోవడం... ప్రస్తుతానికి తాజా సమన్లు ఏవీ పెండింగ్‌లో లేనందున అభ్యర్థన నిరుపయోగంగా మారుతుంది. రెండవది, పీఎంఎల్ఏలోని సెక్షన్ 50, 63లను సవాలు చేసే అంశంపై... సుప్రీంకోర్టు ఈ అంశంపై ఇప్పటికే నిర్ణయం తీసుకుంది కాబట్టి ఈ దశలో దానిని నిర్వహించడం సాధ్యం కాదు' అని కోర్టు పేర్కొంది. సమన్ల గడువు ఇప్పటికే ముగిసినందున ఈ స్థానంలో అదనపు ఉపశమనం లేదని హైకోర్టు తెలిపిందని న్యాయవాది చెప్పారు. భూ కుంభకోణం కేసుకు సంబంధించి సోరెన్‌కు ఆగస్టు మధ్యలో ఈడీ సమన్లు పంపింది. అయితే, రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహాల్లో తాను బిజీగా ఉన్నానని పేర్కొంటూ ఆయన విచారణకు హాజరు కాలేదు. ఆగస్టు 24, సెప్టెంబరు 9వ తేదీల్లో హాజరుకావాలని మరోసారి కోరినప్పటికీ దర్యాప్తు సంస్థ ముందు హాజరుకాలేదు.

సాంకేతికతతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- విశాఖ సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ
- మాతృభూమి పైలట్ జియో పోర్టల్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సాంకేతికత సహకారంతో భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, బహుళ ప్రయోజనాలు ఒనగూరుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ తెలిపారు. ఆ దిశగా అన్ని రాష్ట్రాలూ భూ రికార్డులను నవీకరించాలని సూచించారు. ఇప్పటికే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని, అవి ఇతర రాష్ట్రాలకు తప్పకుండా మార్గదర్శకం అవుతాయని ఆయన కితాబిచ్చారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్సు మోడరనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో విశాఖపట్టణంలోని ఒక హోటల్‌లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. భూ సర్వే, రికార్డుల భద్రత, నవీకరణ, మ్యుటేషన్ ప్రక్రియ, భూ సేకరణ, భూ సమీకరణ, రెవెన్యూ చట్టాల అమలు, రెవెన్యూ కోర్టు, ఈ-కోర్టు విధానాలు, స్వామిత్వ పథకం అమలు, ఆర్‌ఓఆర్ పట్టాల పంపిణీ తదితర అంశాలు సదస్సులో చర్చకు వచ్చాయి. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న భూ విధానాలు, రికార్డుల నవీకరణ ఇతర ప్రక్రియల గురించి ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఉన్నతాధికారులు కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. సదస్సులో భాగంగా ముందుగా ఏపీ రాష్ట్ర సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగం కమిషనర్ సిద్ధార్థ జైన్ ప్రారంభోపాన్యాసం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు, ఇతర అడ్డంకులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, రోవర్లు, డ్రోన్లు ఉపయోగించి రీసర్వే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రక్రియను 54 శాతం పూర్తి చేశామన్నారు. జిల్లా కేంద్రాల్లో మోడరన్ రికార్డ్ రూమ్‌లు ఉన్నాయని, వాటి సేవలను భవిష్యత్తులో మండల స్థాయికి కూడా విస్తరిస్తామని చెప్పారు. పాత సర్వే నంబర్లు, ఎఫ్‌ఎంబీల ప్రామాణికంగా రీ సర్వే చేస్తూ కొత్త ఎల్‌పీఎంలను కేటాయిస్తున్నామని, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివిధ అంశాలపై విపులంగా చర్చించారు. దేశమంతటికీ ఒకే వేదికగా మాతృ భూమి పేరుతో పైలట్ జియో పోర్టల్‌ను ఆవిష్కరించామని, అన్ని రాష్ట్రాలు ఇక నుంచి భూ సంబంధిత రికార్డులను నవీకరించి ఈ పోర్టల్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. భవిష్యత్తులో తలెత్తే ఎన్నో ప్రశ్నలకు మాతృభూమి పోర్టల్ సమాధానంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉన్న అన్ని రకాల భూ రికార్డులను నవీకరించాలని, రాజ్యాంగంలో గుర్తించిన భాషల్లోకి అనువదించాలని సూచించారు. న్యాయపరమైన అంశాల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఈ-కోర్టు విధానానికి అనుగుణంగా వివరాలను అనుసంధానం చేయాలన్నారు. రెవెన్యూ కోర్టు అంశాలను పరిగణనలోకి తీసుకొని పక్కా వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. పూర్తి పారదర్శకత ఉండేలా ఎఫ్‌ఎంబీ మ్యాపులను అనుసంధానించాలని, భూ ఆధార్ విధానంలో భాగంగా సంబంధిత రైతుల ఆధార్ నంబర్లను ఖాతాలకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఒకే సిస్టం... ఒకే సాఫ్ట్‌వేర్ విధానంలో భాగంగా యావత్తు దేశ భూ సంబంధిత వివరాలను మాతృభూమి పోర్టల్ వేదికగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ క్రమంలో మాతృభూమి పోర్టల్ ఆవశ్యకతను అజయ్ టిర్కీ వివరించారు. అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సోన్మోని బోరా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా చొరవ ప్రాజెక్టులలో భాగంగా భూ సంవాద్-6 ప్రాజెక్టు విజయవంతం అయ్యేలా అందరూ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మినిమం గవర్నమెంటు, మాక్సిమమ్ గవర్నెన్స్ విధానాన్ని అందరూ అనుసరించాలన్నారు. సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఎన్ఐసీ, ఐటీ అధికారులు, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ఈనెల 14 నుంచి 24 వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి ఈ నెల 25న పాఠశాలలను పునః ప్రారంభిస్తారు. దసరా సెలవులతో 11 రోజులపాటు పాఠశాలలు మూతపడనున్నాయి. తొలుత ఈ దసరా సెలవుల్లోనే ఎస్ ఏ(1) పరీక్షలను నిర్వహించాలని విద్యాశాఖ భావించింది. దానిపై ఉపాధ్యాయ వర్గాల నుంచి వ్యతిరేకత రావడంతో, నవంబరుకు వాయిదా వేశారు. అటు దసరా సెలవుల్లోనూ కార్పొరేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు యథాతథంగా తరగతులను నిర్వహించేందుకు సిద్ధమయ్యారని సమాచారం. దీనిపై విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దసరాకు 5,500 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

దసరా పండుగను పురస్కరించుకొని ఏపీఎస్ఆర్టీసీ 5500 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముందస్తు చర్యలు చేపట్టారు. దసరాకు ముందు రోజుల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 2,700 బస్సులను నడపనున్నారు. దసరా తర్వాత 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 2,800 బస్సులు నడపనున్నారు. మొత్తంగా దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ 5500 ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడపనుంది. ఈ ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నడుపుతారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యమూ కల్పించారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాలు, నగరాలకు ఈ బస్సుల సౌకర్యం ఏర్పాటు చేశారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక రాష్ట్రాలకు ప్రత్యేక సర్వీసులు రాకపోకలు కొనసాగించనున్నాయి. ఈ ప్రత్యేక సర్వీస్ లో పర్యవేక్షణ కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక అధికారులను నియమించింది. దసరా సెలవులు ప్రకటించడంతో తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు గణనీయంగా పెరగనున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ బస్సులతో పాటు రైళ్ల ప్రత్యేక వాహనాల ద్వారా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు సామాన్య ప్రజలు అత్యధికంగా ఉంటారు. వారి సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు ప్రారంభించింది.

రెండేళ్లలో రూ.12వేల కోట్లు స్వాహా

భారతీయుల జేబుల నుంచి కొట్టేసిన 'మోదానీ': జైరాం రమేశ్

న్యూఢిల్లీ: దేశంలో రూ.12వేల కోట్ల కుంభకోణం జరిగిందని, మోదానీ కలిసి భారతీయుల జేబుల్లో నుంచి ఈ భారీ మొత్తాన్ని కొట్టేశారని కాంగ్రెస్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఓ విదేశీ పత్రిక చేసిన ఆరోపణల ఆధారంగా దీనిని ఆధునిక భారతంలో అతిపెద్ద కుంభకోణంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వర్ణించారు. భారతీయుల జేబుల్లో నుంచి కోట్లు లూటీ చేశారని, అదానీ సంస్థకు ఆస్తులు కూడగట్టుకోవడంలో అధికార బీజేపీ ప్రభుత్వం మద్దతిచ్చిందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను బలహీనపర్చేలా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పొందుతుండటం బీజేపీ నోరు కట్టేస్తోందని విమర్శించారు. దీంతో అదానీ సంస్థ ఆడిందే ఆటగా సాగుతోందన్నారు. 'ఆధునిక భారతంలో ఇది అతిపెద్ద కుంభకోణం. భారతీయుల కడుపుకొట్టి భారీగా లూటీకి అత్యాస తోడైంది. ఎంతటి కుంభకోణం జరిగినా తప్పించుకోవచ్చన్న నమ్మకం, ప్రజల దృష్టిని మళ్లించవచ్చన్న నమ్మకం ఇక్కడ కనిపిస్తోంది. చక్రవర్తి పొరబడ్డారు. భారత్‌ను మోదానీ వసపర్చుకోలేదు. 2024లో భారత ప్రజలు దీటైన బదులిస్తారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 2019-21లో 3.1 మిలియన్ టన్నుల 30 అదానీ బొగ్గు షిప్‌మెంట్లను అధ్యాయనం చేసి బొగ్గు వర్తకంలో ఎంత తక్కువగా చూసుకున్నా 52శాతం లాభం ఉన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్నదని ఆయన వెల్లడించారు.

ఉపా కేసులో అరెస్టుపై న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడి వ్యాజ్యం కొట్టివేత

న్యూఢిల్లీ: ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నమోదయిన కేసులో న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, పోర్టల్ మానవ వనరుల విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిలను అరెస్ట్ చేసి, తదుపరి పోలీసు రిమాండ్‌కు తరలించడంపై జోక్యం చేసుకోవడానికి దిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. పురకాయస్థ, చక్రవర్తి తమను పట్టుకున్నప్పుడు అరెస్టుకు సంబంధించిన ఆధారాలు తమకు అందించలేదని వాదించారు. వారి న్యాయవాదులు లేకపోవడంతో ట్రయల్ కోర్టు రిమాండ్ ఆర్డర్ జారీ చేసింది. పిటిషన్లను కొట్టివేసిన జస్టిస్ తుషార్ రావు గేదెల... అరెస్టుకు సంబంధించి 'విధానపరమైన బలహీనత' లేదా చట్టపరమైన లేదా రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘన లేదని, రిమాండ్ ఆర్డర్ చట్టంలో స్థిరమైనదని అన్నారు. అరెస్టుకు గల కారణాలను 24 గంటల్లోగా అరెస్టు చేసిన వ్యక్తికి 'సమాచారం' అందించాల్సిన అవసరం ఉందని, అలాంటి కారణాలను లిఖితపూర్వకంగా అందించడం ఉపా ద్వారా తప్పనిసరి కాదని న్యాయమూర్తి తెలిపారు. అయితే 'సున్నితమైన విషయాలను' సరిదిద్దిన తర్వాత పోలీసులు ఇకమీదట అరెస్టుకు సంబంధించిన కారణాలను వ్రాతపూర్వకంగా అందించడం మంచిది' అని కోర్టు పేర్కొంది. పిటిషన్ ఎటువంటి మెరిట్ లేకుండా ఉండటం, పెండింగ్ దరఖాస్తులతో పాటు కొట్టివేయబడింది' అని పోర్టల్ వ్యవస్థాపకుడు చేసిన పిటిషన్‌పై కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 'మొత్తం సమస్యను సరైన దృక్కోణంలో పరిశీలించిన తర్వాత, అరెస్టుకు గల కారణాలను పిటిషనర్‌కు అరెస్టు చేసిన వెంటనే తెలియజేసినట్లు, అలాగే విధానపరమైన లోపాలు ఏవీ కనిపించడం లేదని తెలుస్తోంది. ఉపాలోని సెక్షన్ 43బీ లేదా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) నిబంధనలను ఉల్లంఘిస్తే, అరెస్టు చట్టానికి లోబడి ఉంటుంది' అని కోర్టు పేర్కొంది. ఉపా కింద నేరాలు నేరుగా దేశం సుస్థిరత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని ప్రభావితం చేస్తాయని, అవి జాతీయ భద్రత, అరెస్టుకు గల కారణాలను మాత్రమే తెలియజేయాల్సిన అవసరం ఉన్నందున చాలా ముఖ్యమైనవి అని కోర్టు పేర్కొంది.'పంకజ్ బన్సల్ (సుప్రా) కేసులో సుప్రీం కోర్టు నిర్దేశించిన చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపా కఠినమైన నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకుంటే, ప్రతివాది, ఇకమీదట అరెస్టుకు కారణాన్ని లిఖితపూర్వకంగా అందించడం మంచిది. ప్రతివాది అభిప్రాయం ప్రకారం 'సున్నితమైన అంశం' గా మారుతుంది. ప్రస్తుత కేసులో చేసిన అరెస్ట్‌కు ఎలాంటి సవాలునైనా సుప్రీం కోర్టు నిలిపివేస్తుంది' అని కోర్టు తెలిపింది. పుర్కాయస్థ, చక్రవర్తిని దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం అక్టోబరు 3న అరెస్టు చేసింది. అరెస్టుతో పాటు ఏడు రోజుల పోలీసు కస్టడీని సవాల్ చేస్తూ, మధ్యంతర ఉపశమనంగా తక్షణమే విడుదల చేయాలని వారు హైకోర్టును ఆశ్రయించారు. అక్టోబరు 10న ట్రయల్ కోర్టు వారిని పది రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. చైనా అనుకూల ప్రచారం కోసం డబ్బు అందుకున్నారనే ఆరోపణలపై ఉగ్రవాద నిరోధక చట్టం చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కింద ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ ప్రకారం, 'భారత సార్వభౌమాధికారానికి భంగం కలిగించడానికి', దేశంపై అసంతృప్తిని కలిగించడానికి చైనా నుంచి పెద్ద మొత్తంలో న్యూస్‌పోర్టల్‌కి నిధులు వచ్చాయని, 2019 లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడానికి పీపుల్స్ అలయన్స్ ఫర్ డెమోక్రసీ అండ్ సెక్యులరిజం (పీఏడీఎస్) తో కలిసి పుర్కాయస్థ కుట్ర పన్నారని కూడా ఆరోపించింది.

ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

సజ్జలకు దళిత, గిరిజన, స్వచ్ఛంద, ప్రజాసంఘాల నేతల విజ్ఞప్తి



విశాలాంధ్ర-విజయవాడ: పేదల ఆత్మబంధువు ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వసలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజన, స్వచ్ఛంద, ప్రజాసంఘాల నేతల తరపున సజ్జలను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసిన ఎస్ఆర్ శంకరన్... ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తీవ్రంగా కృషి చేశారని, అణగారిన వర్గాల కోసం పథకాలు రూపొందించి ప్రభుత్వాలతో అమలు చేయించిన మానవతావాది అని కొనియాడారు. రాష్ట్ర రాజధాని విజయవాడ నగరంలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో శంకరన్ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయటం పట్ల అభినందనలు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లోనూ, ఉభయరాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు శంకరన్ విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు శంకరన్ జయంతి, వర్ధంతులను ప్రజలే సొంత ఖర్చులతో నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఏ ఒక్కరో ఖర్చులు భరించటం ఆయనకు గౌరవం కాదని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వమే ఆ కార్యక్రమాలు నిర్వహించేందుకు చట్టబద్ద చర్యలు తీసుకోవాలని జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని, ఈ నెల 22వ తేదీన శంకరన్ 89వ జయంతి ఉందని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఇందుకు సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు కోట కల్యాణ్, గుండిమెడ క్రాంతికుమార్, డీబీఈఎస్ నాయకులు అన్నవరపు నాగేశ్వరరావు, మిత్రా సేవాట్రస్ట్ నేత అనపర్తి గుప్తా, హెల్ప్ ది హోప్‌లెస్ సంస్థ నాయకులు ఈదులూరి రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కాబోతు ఈశ్వరరావు, నాయకులు ఉప్పె నరసింహారావు, భూక్యా దీశ్య, భూక్యా గోపి, ఇస్లావతు అశ్వద్ధామ, లావూరి తిరుపతమ్మ, ఇస్లావతు పాప తదితరులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఉత్తరాంధ్రలో 100 విశాలాంధ్ర సంవత్సర చందాల చేర్పింపు

విశాలాంధ్ర-కొమ్మాది(విశాఖ జిల్లా): ఉత్తరాంధ్రలో విశాలాంధ్ర దినపత్రిక చందాల చేర్పింపు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. అందులో భాగంగా విశాఖపట్నం ఎడిషన్ కార్యాలయం మారికవలసలో ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య విలేకరుల సమావేశం శుక్రవారం జరిగింది. విజయనగరం జిల్లా నుండి 50 సంవత్సర చందాలు, శ్రీకాకుళం జిల్లా నుండి 50 సంవత్సర చందాలకు సంబంధించిన డబ్బును విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్‌బాబుకు ఆ జిల్లాల బ్యూరోలు, రిపోర్టర్లు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలో విశాలాంధ్ర పత్రికను మరింత పెంచాలని హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. భవిష్యత్ కర్తవ్యాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. 2024 క్యాలెండర్‌కు యాడ్‌ల సేకరణ కోసం విశాఖ ఎడిషన్ పరిధిలో ఉన్న విలేకరులంతా అంకిత భావంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో హరినాథరెడ్డి, అజయ్‌బాబుతో పాటు సీఏ సీహెచ్ రాంబాబు, ఎడిషన్ మేనేజర్ సనపల నరసింహులు, ఉత్తరాంధ్ర జిల్లాల బ్యూరోలు పి.రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, రమేశ్, ఎర్రయ్య రెడ్డి, ఎస్.రమేశ్, సబ్‌ఎడిటర్లు శివప్రసాద్, ఆర్‌వీ సంధ్య, ప్రతాప్, సత్యం పాల్గొన్నారు.

ప్రపంచకప్‌లో నేడు మహా సమరం

అహ్మదాబాద్‌లో భారత్×పాక్

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్-2023లో కోట్లాదిమంది అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో టీమిండియా తలపడనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంల ఈ మ్యాచ్ జరగనుండగా... రెండు జట్ల ఆటగాళ్లు అహ్మదాబాద్‌కు చేరుకుని... ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. ఈ మెగా టోర్నీలో రెండు జట్లు దూకుడు మీద ఉన్నాయి. ఆడిన రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించాయి. హ్యాట్రిక్ విజయం బరిలోకి దిగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు మొదటి సారిగా ఎప్పుడు తలపడ్డాయి? దాయాదుల పోరులో ఏ జట్టుది పైచేయిగా ఉందో చూద్దాం... మొత్తంగా వన్డే ఫార్మాట్‌లో పాకిస్తాన్ దే పైచేయి. భారత్-పాక్‌లు 134 వన్డే మ్యాచ్‌లు ఆడగా... 73 మ్యాచ్‌ల్లో పాక్ విజయం సాధించగా... భారత్ 56 మ్యాచ్‌ల్లో గెలుపొందింది. అయితే వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం ఆ జట్టుకు భారత్‌పై చెత్త రికార్డు ఉంది. ప్రపంచకప్ టోర్నీ (1975-2019)లో ఇప్పటివరకు రెండు జట్లు 7 సార్లు తలపడగా.. టీమిండియానే 7 సార్లు విజయం సాధించింది. ఇప్పుడు ఎనిమిదో సారి కూడా పాకిస్తాన్‌ను చిత్తు చేయాలని టీమిండియా ధీమాతో ఉంది. మరోవైపు పాకిస్తాన్ మాత్రం ఈసారైనా టీమిండియాను ఓడించి లెక్క సరిచేయాలని ఉవ్విళ్లూరుతోంది. ఇక చివరగా ఇంగ్లండ్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్-2019లో దాయాది జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ(140) మెరుపు సెంచరీ చేయగా... మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 336 పరుగులు చేసింది. అనంతరం పాకిస్తాన్ 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసిన దశలో వర్షం అంతరాయం కలిగించింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధనల ప్రకారం 89 పరుగుల తేడాతో టీమిండియా గెలుపొందింది. అంతకు ముందు భారత్ వేదికగా జరిగిన 2011 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో భారత్ 29 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై విజయ ఢంకా మోగించింది.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శుభమన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, రవిచంద్రన్ అశ్విన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్.

పాకిస్తాన్ జట్టు: బాబర్ అజామ్ (కెప్టెన్), షాదాబ్ ఖాన్, ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, అబ్దుల్లా షఫీక్, మహ్మద్ రిజ్వాన్, సౌద్ షకీల్, ఇఫ్తీకర్ అహ్మద్, సల్మాన్ అలీ అఘా, మహ్మద్ నవాజ్, ఉసామా మీర్, హారీస్ రవూఫ్, హసన్ అలీ, షాహీన్ అఫ్రిది, మహ్మద్ వసీం.

ఒలిపింక్స్‌లో క్రికెట్

ఐఓసీ గ్రీన్‌సిగ్నల్

ముంబై: క్రికెట్ అభిమానులకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) శుభవార్త తెలిపింది. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్‌ను చేర్చేందుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు ఐఓసీ నిర్ణయం తీసుకున్నట్లు ముంబైలో జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు ఐఓసీ థామస్ బాచ్ ఈ విషయాన్ని తెలిపారు. ఒలింపిక్స్‌లో కొత్తగా ఐదు క్రీడలను చేర్చాలనుకున్నారని, దాంట్లో క్రికెట్ కూడా ఉందని, ఆ ప్రతిపాదనకు లాస్ ఏంజిల్స్ నిర్వాహకులు ఆమోదించినట్లు థామస్ బాచ్ పేర్కొన్నారు. దీనిపై తుది ప్రకటన సోమవారం వెలువడే అవకాశం ఉంది. 128 ఏళ్ల బ్రేక్ తర్వాత మళ్లీ క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో ఆడించనున్నారు.

శుభ్‌మన్ ఆడేది డౌటే!

అహ్మదాబాద్: భారత జట్టు ఓపెనింగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం డెంగీతో బాధపడుతున్నాడు. ఈ కారణంగా అతను వన్డే ప్రపంచ కప్‌లో మొదటి రెండు మ్యాచ్‌లలో ఆడలేకపోయాడు. అయితే శనివారం అహ్మదాబాద్‌లో పాక్‌తో జరిగే మ్యాచ్‌లో కూడా గిల్ ఆడడం కష్టమేనని తెలుస్తోంది. అతను ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. అయితే ఈలోగా శుభ్‌మన్‌గిల్‌కి ఓ శుభవార్త వచ్చింది. ఐసీసీ ఒక ప్రత్యేక అవార్డుతో గిల్‌ను సత్కరించింది. ప్రతి నెలా ఒక అత్యుత్తమ ఆటగాడిని ఐసీసీ ఎంపిక చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ నెలలో ఆటగాడి ప్రదర్శనను ప్రామాణికంగా తీసుకుని ప్లేయర్ ఆఫ్ ది మంత్ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. అలా సెప్టెంబరు నెలకు గానూ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుగా గిల్ ఎంపికయ్యాడు. అయితే అనారోగ్య సమస్యలతో గిల్ ఈ నెలలో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గిల్ త్వరగా కోలుకోవాలని, తద్వారా భారత బ్యాటింగ్ మరింత పటిష్టంగా మారాలని టీమిండియాతో పాటు అభిమానులు కోరుకుంటున్నారు. గిల్ సెప్టెంబర్ నెలలో మొత్తం ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 480 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు అర్ధసెంచరీలు ఉన్నాయి. ఆసియా కప్ టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌పై 121 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీని తర్వాత ఇండోర్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచ్‌లో 104 పరుగులు చేశాడు. ఆ తర్వాత మొహాలీలో ఆస్ట్రేలియాపై 74 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఆసియా కప్‌లో పాకిస్తాన్, నేపాల్‌లపై అర్ధ సెంచరీలు సాధించాడు. గిల్ ప్రదర్శన కారణంగానే ప్రతిష్ఠాత్మక ఆసియా కప్‌ను భారత్ గెల్చుకుంది. గిల్ ఇదే ఫామ్‌ను ప్రపంచకప్‌లో కూడా కొనసాగిస్తాడని అభిమానులు భావించారు. అయితే ఆస్ట్రేలియాతో తొలి మ్యాచ్‌కు ముందు అతను డెంగీ బారిన పడ్డాడు. ఈ కారణంగా అతను తొలి మ్యాచ్ ఆడలేదు. ఆ తర్వాత అఫ్గానిస్తాన్‌పై కూడా ఆడలేదు. ఇప్పుడు దు పాకిస్తాన్‌పై ఆడడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే గిల్ గురువారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. మరి ఇప్పుడు పాకిస్తాన్‌పై మైదానంలోకి దిగేందుకు అతడు పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడా లేదా అనేది చూడాలి. ఒకవేళ పాకిస్తాన్‌తో ఆడకపోతే 19న బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గిల్ బరిలోకి దిగవచ్చు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.